తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice | వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

27-08-2026

గురువారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 200

PUBLISHED FROM HYDERABAD | పేజీలు-8 | వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575




# మృత్యుఘోష

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
## ఆరుగురు ప్రయాణికులు దుర్మరణం

- ఆగివున్న ఐరన్ లారీని ఢీకొట్టిన బస్సు
- 20 మందికి తీవ్ర గాయాలు
- మృతులంతా ఏపీకి చెందినవారే
- ఘటనపై సీఎం, మంత్రి ఉత్తమ్ దిగ్భ్రాంతి

తెల్లవారుజామున గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులను మృత్యువు వెంటాడింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మృ తుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మం ది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

2

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

- టిబెట్‌లో భూకంపం, విరిగిపడిన మంచుచరియలతో ఉప్పొంగిన భోటేకోశీ నది



- గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు స్త్ర బిహార్, యూపీలకు అలర్ట్
- నేపాల్ ప్రధానికి ప్రధాని మోదీ ఫోన్ స్త్ర తక్షణ సహాయక చర్యలకు హామీ

నేపాల్‌లో బుధవారం ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టనపెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. ఓ అంచనా ప్రకారం 1500 మంది గల్లంతయ్యారని అంటున్నారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి.

4




# సర్కారుపై ఉద్యోగుల సమరం

- సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఉద్యమానికి సిద్ధం
- నేడు హైదరాబాద్ ఇందిరాపార్క్, 33 జిల్లా కేంద్రాలలో మహాధర్నాలు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా నిరసన..
- ప్రభుత్వం దిగిరాకపోతే సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్'


తెలంగాణ బ్యూరో (సిరి న్యూస్):

తెలంగాణ ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ప్రభుత్వ విధానాలపై సమర భేరి మోగించారు. ఉద్యోగుల ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్న కాంగ్రెస్ పాలనలో తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో, పోరాటమే మార్గంగా భావించి ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. రాష్ట్రంలోని దాదాపు 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు మరియు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో

మిగతా 2వ పేజీలో..

# విద్యుత్ జేఏసీతో చర్చలకు ట్రాన్స్కో ఆహ్వానం

2



TRANSMISSION CORPORATION OF TELANGANA LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD-82

Website:https://tgtransco.com CIN No: U40102TG2014SGC094248

From
The Joint Secretary,
TGTRANSCO
Vidyut Soudha,
Hyderabad

To
The Chairman,
TGPEJAC,
#6-3-663, Somajiguda,
Hyderabad – 500 082

Lr.No.JS/DS(Per-II)/AS(IR,R&RTI)/PO(IR)/JPO/E-50/26-1 ,Dt. 26.08.2026

Sir,

Sub: TGTRANSCO- IR - Certain pending issues concerning the Organization and Employees, Artisans and Pensioners of TG Power Utilities - Further Agitational Programs from 27-08-2026 communicated by Telangana Power Employees Joint Action Committee (TGPEJAC) – Meeting scheduled on 29.08.2026 at 3:30 PM – Intimation – Reg.

Ref: 1. Representation dt.20.08.2026 received from the Telangana Power Employees Joint Action Committee (TGPEJAC).

***

I am directed to request you to attend the meeting scheduled on 29.08.2026 (Saturday) at 3:30PM at Meeting Hall, 6th Floor, A Block, Vidyut Soudha with all Four Chairmen & Managing Directors of TG Power Utilities for discussions on the issues raised in the letter cited.

2. It is requested to attend the above meeting without fail and also withdraw the agitation program intimated in the letter cited in view of the above meeting.

Yours faithfully,

Digitally signed by
Bijja Ganesh Rao
Date: 26-08-2026
21:19:48



# వ్యవసాయ శాఖలో ఇన్ సర్వీస్ విధానం రద్దు!


- జీవో 39పై ఏఈఓల సమర భేరి
- 50 ఏళ్లుగా కొనసాగుతున్న నిబంధనల్లో మార్పు
- వందలాది మంది ఏఈఓలకు అన్యాయం
- ప్రభుత్వ విధానంపై ఆగ్రహంతో ఉద్యోగులు
- క్షేత్ర స్థాయి ఉద్యోగులపై కక్ష కడతారా అంటు మండిపాటు
- జీఓ 39 రద్దు చేయకుంటే సహాయనిరాకరణ తప్పదంటూ హెచ్చరిక

2

తెలంగాణాలో సంస్కరణల పేరిట ప్రభుతం చేస్తున్న మార్పులు ఉద్యోగుల్లో భారీ వ్యతిరేకతకు కారణమవుతున్నాయి. ఏళ్లుగా కొనసాగుతున్న విధానాల్లో మార్పులు తెస్తూ ప్రభుత్వ పతకాలను ప్రజలకు చేర్చే వ్యవస్థలను ఇబ్బందుల పాలు చేస్తున్నారంటూ ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:



# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

- నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది.

2

## మీ సేవా కేంద్రాలే డిజిటల్
# మార్కెటింగ్ హబ్‌లు

- రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మార్కెటింగ్ సేవల విస్తరణ
- మెటాతో కలిసి వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ
- కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

3






## తెలంగాణ సమ్మిట్‌కు
# వార్ రూమ

- ప్రజాభవన్‌లో తక్షణమే ఏర్పాటుకు భట్టి ఆదేశం
- డిసెంబర్ సమ్మిట్‌కు దేశ, విదేశాల్లో విస్తృత రోడ్‌షోలు
- అతిథులకు ఆహ్వానాలు పంపే ప్రక్రియ వేగవంతం చేయాలి
- గత అవగాహన ఒప్పందాల పురోగతిపై ప్రత్యేక సమీక్ష
- రోజూ గంటపాటు పనుల పురోగతిని సమీక్షించనున్న సీఎస్

2

## పెట్టుబడులను ఆకర్షించేలా
# ఇన్వెస్ట్ తెలంగాణ

- నిపుణులతో కమిటీల ఏర్పాటు
- బొగ్గు నుంచి కీలక ఖనిజాల దిశగా సింగరేణి
- వ్యూహాత్మక ప్రణాళికతో సింగరేణి విస్తరణ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, సిరి న్యూస్:

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం

మిగతా 2వ పేజీలో..

## పెట్టుబడులను ఆకర్షించేలా
# ఇన్వెస్ట్ తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు.

సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.


**వ్యూహాత్మక ప్రణాళికతో సింగరేణి విస్తరణ**

తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయవంటి ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిని లాభదాయక సంస్థగా నిలబెట్టి భవిష్యత్ తరాలకు అందించడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బొగ్గు తవ్వకాలతో పాటుగా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. క్రిటికల్ మినరల్స్, బొగ్గు గనులకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే అన్ని వేలం ప్రక్రియల్లో పాల్గొనాలని ఆయన అధికారులకు చెప్పారు. బుధవారం ఉదయం మహాత్మా జ్యోతీరావు పూలే ప్రజా భవన్ లో సింగరేణి అధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావం వల్ల విద్యుత్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో సింగరేణి డిమాండ్ కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సూచించారు. సింగరేణి కేవలం బొగ్గు మైనింగ్ కే కాకుండా అన్ని రకాల మైనింగ్ లోకి ప్రవేశించాలని ఆయన అధికారులకు చెప్పారు. ఇందుకు ప్రజాప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని అన్నారు. రానున్న కాలంలో వెనిడీయం, టైటానియం లాంటి ఖనిజాల బ్లాక్ లు వేలంలోకి వస్తున్న తరుణంలో వాటిని దక్కించుకునేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకువ వెళ్లాలని ఆయన అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన భద్రత విషయంలో సింగరేణి తన పాత్రనే మరింత గా పోషించాలని ఆయన చెప్పారు. ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాలు మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు.

## విద్యుత్ జేఏసీతో చర్చలకు
# ట్రాన్స్కో ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు26, (సిరి న్యూస్):**



TRANSMISSION CORPORATION OF TELANGANA LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD-82

Website:https://tgtransco.com CIN No: U40102TG2014SGC094248

From
The Joint Secretary,
TGTRANSCO
Vidyut Soudha,
Hyderabad

To
The Chairman,
TGPEJAC,
#6-3-663, Somajiguda,
Hyderabad – 500 082

Lr.No.JS/DS(Per-II)/AS(IR,R&RTI)/PO(IR)/JPO/E-50/26-1 ,Dt. 26.08.2026

Sir,

Sub: TGTRANSCO- IR - Certain pending issues concerning the Organization and Employees, Artisans and Pensioners of TG Power Utilities - Further Agitational Programs from 27-08-2026 communicated by Telangana Power Employees Joint Action Committee (TGPEJAC) – Meeting scheduled on 29.08.2026 at 3:30 PM – Intimation – Reg.

Ref: 1. Representation dt.20.08.2026 received from the Telangana Power Employees Joint Action Committee (TGPEJAC).

***

I am directed to request you to attend the meeting scheduled on 29.08.2026 (Saturday) at 3:30PM at Meeting Hall, 6th Floor, A Block, Vidyut Soudha with all Four Chairmen & Managing Directors of TG Power Utilities for discussions on the issues raised in the letter cited.


2. It is requested to attend the above meeting without fail and also withdraw the agitation program intimated in the letter cited in view of the above meeting.

Yours faithfully,
Digitally signed by
Bijja Ganesh Rao
Date: 26-08-2026
21:19:48
Joint Secretary

తెలంగాణలోని విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిసియన్లు, పెన్షనర్ల సమస్యలపై నేటి నుండి నిరవధికంగా రిలే దీక్షలు చేపట్టాలని విద్యుత్ జేఏసీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ని ఈ నెల 29వ తేదీన ఆహ్వానిస్తూ ట్రాన్స్కో ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఒకవైపు ఉద్యమానికి సిద్ధమవుతున్న తరుణంలో ట్రాన్స్కో ఉత్తర్వులు జారీచేయడంతో కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని విద్యుత్ జేఏసీ నిర్ణయించినట్టు సమాచారం. విద్యుత్ శాఖలోని అన్ని వర్గాలు ఏకమై ఇటీవల విద్యుత్ సౌధ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఆ కార్యక్రమం విజయవంతం ఐనప్పటికీ ట్రాన్స్కో చర్చలకి ఆహ్వానించలేదు. ఐతే నేటి నుండి పోరాటానికి విద్యుత్ ఉద్యోగులు సమాయత్తమవుతున్నారని యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. ఇందుకోసం ఈ నెల 29 వ తేదీన సాయంత్రం 3 గంటలకు విద్యుత్ సౌధలో చర్చలు ఉంటాయని ట్రాన్స్కో జాయింట్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు.

## అమెరికా ఘోర
# రోడ్డు ప్రమాదం

**నిజామాబాద్, ఆగస్ట్ 26, సిరి న్యూస్:**



అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మ□డు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లి దండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరు మున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మ□డు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మ□డు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# వ్యవసాయ శాఖలో ఇన్ సర్వీస్ విధానం రద్దు!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**



ఒకవైపు ఇప్పటికే పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేసేందుకు ఇచ్చిన జీవోపై విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేస్తుండగా, తాజాగా వ్యవసాయ విస్తరణ అధికారులకు హక్కుగా లభిస్తున్న ఇన్ సర్వీస్ విద్యను తొలగిస్తూ ఇచ్చిన జీవోనంబర్ 39 మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇకపై ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదివే అవకాశాలు కోల్పోనున్నారు. ఇది ప్రభుత్వ విధానాల్లో జరుగుతున్నలోపాలను సరిదిద్దలేక మార్పులు చేస్తూ భవిష్యత్తును ఎంతో ఉన్నతంగా చిత్రీకరించుకున్న ఏఈఓ లకు అన్యాయం చేయడమేనని ఉద్యోగులు వాపోతున్నారు.

**ఈ విధానం మొదలైంది ఇలా**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయశాఖలో ఇన్ సర్వీస్ విధానం ప్రారంభమైంది. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సమయంలో జీవో నంబర్ 225 ద్వారా మార్చ్ 11 1976 లో వ్యవసాశాఖలో ఉన్నత విద్యను అభ్యసించే వారికి అవకాశం కల్పిస్తూ వారికి పదోన్నతుల్లో సైతం 3 శాతం కోటాను కేటాయించారు. అప్పటి ప్రభుత్వ ఉద్దేశం ప్రకారం క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులకు అనుభవంతో పాటు మరింత శాస్త్రీయ పరిజ్ఞానం పెరగాలని అందుకే ఉన్నత విద్య ఇన్ సర్వీస్ విధానాన్ని ప్రోత్సహించారు. అలా వ్యవసాయ శాఖకు అత్యంత కీలకమైన ఉద్యోగులను మరింత ప్రోత్సహిస్తూ వారి కోటను 3 శాతం నుండి 5 శాతానికి 2017లో పెంచారు.

**డిప్లొమా విద్యార్థులకు ఎందుకు ఈ శిక్ష?**

తెలంగాణలోని వ్యవసాయశాఖలో కీలకమైన వ్యవసాయ విస్తరణ అధికారుల నియమానికి అర్హత డిప్లొమా కానీ ఇదే పోస్టులకు ఎంపికవుతున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు పదోన్నతులలో ఎక్కువగా అవకాశం లభిస్తోంది. దీనివల్ల డిప్లొమా చేసి వచ్చిన వారికీ అన్యాయం జరుగుతోంది. ఇక్కడ అర్హతతో వచ్చినోళ్లకు ఇచ్చిన ఇన్ సర్వీస్ విధానం సైతం ఎత్తేస్తే ఇకముందు వారికీ పదోన్నతులు అందని ద్రాక్షగా తయారయ్యే అవకాశం లేకపోలేదు. ఇదే విషయంలో ఉద్యోగులు జిల్లాల వారీగా తమ నిరసనలు హోరెత్తించిన ప్రభుత్వం స్పందించకపోవడంపై ఏ శాఖ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

**యూనియన్లు అభ్యర్థించినా పట్టించుకోలే..**

వ్యవసాయ శాఖలో ఏఈఓ లకు ఇన్ సర్వీస్ కోటా ఎత్తివేయొద్దని కోరుతూ తెలంగాణ వ్యవసాయ శాఖ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ల సంఘము ఆధ్వర్యంలో గత నెల ఏఈఓ లు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కు వినతి పత్రం ఇచ్చారు. కోటాను ఎత్తివేస్తే వచ్చే సమస్యలను సైతం వివరించారు. కానీ ప్రభుత్వం వారి విజ్ఞాపాలను నిరసనలను పక్కన పెట్టి జీవో ఇవ్వడంపై వ్యవసాయ విస్తరణ అధికారులు మండి పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో నిత్యం ప్రభుత్వం తరపున అదనపు భారాన్ని మోస్తూ పనులు చేస్తుంటే ప్రభుత్వం తమకు కలిగిన అవకాశాలు తీసేయడం ఎంతవరకు సమంజసమని వారు వాపోతున్నారు.

**ఇక నిరసన బాటలోనే..**

తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారులు జీవో నంబర్ 39 కి వ్యతిరేకంగా త్వరలో పూర్తి స్థాయి నిరసనలకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయం పెను భారం అనే తీరుగా ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఒకవైపు యూరియా యాప్ సమస్య మరోవైపు సన్న రకం వారి ధాన్యం వేసిన వారిని నమోదు చేయించుకోవాలన్న నిబంధన.. ఇలా ఒకదానివెంట ఒకటి నిబంధలు పెడుతున్నారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరక్షరాస్యులైన రైతుల పాలిట శాపముగా మారింది. ఇప్పటి వరకు అలంటి రైతులకు సహకరించి ఇబ్బందులు లేకుండా చూసిందే వ్యవసాయ విస్తరణ అధికారులు. కానీ కొత్త జీవో మూలంగా తాము ఇక ఉన్నత చదువులు చదవలేమన్న భావనతో వారంతా సహాయ నిరాకరణ చేస్తే? ఎలా అన్నది ప్రస్తుత సమస్య. కొత్త విధానం మూలంగా 1400 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు ఇన్ సర్వీస్ కోటాకు దూరం కానున్నారు. దీంతో వీరంతా కచ్చితంగా సహాయ నిరాకరణే సర్కారు నిర్ణయానికి సమాధానం అన్న రీతిలో ముందుకు వెళ్లనున్నట్టు సమాచారం. ఒకవేళ అదే గనక జరిగితే ఇప్పటికే రైతులపై పెరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేకత మరింత తీవ్రం అయ్యే అవకాశం లేకపోలేదు. ఏది ఏమైనా ఇటీవల తీసుకుంటున్న ప్రభుత్వ నిర్ణయాలు అటు ప్రజల్లోనూ ఇటు విద్యార్థుల్లోనూ ఉద్యోగుల్లోనూ తీవ్ర నిరసనలకు కారణమవుతున్నాయి.

# మృత్యుఘోష

**సూర్యాపేట, ఆగస్టు 26, సిరి న్యూస్:**

తెల్లవారుజామున గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులను మృత్యువు వెంటాడింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మృతులను ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇనుప సామగ్రితో ఉన్న లారీ రహదారిపై ఆగి ఉండగా ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు లారీలోని ఇనుప సామగ్రి బస్సులోకి చొచ్చుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తెల్లవారుజాము కావడంతో పలువురు ప్రయాణికులు నిద్రలో ఉండటం, ప్రమాదాన్ని గుర్తించి తప్పించుకునే అవకాశం లేకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువైనట్లు తెలుస్తోంది. ఉదయం 9 గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం అనంతరం బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

**'కళ్ల ముందే నా భార్య చనిపోయింది'**

ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఓ ప్రయాణికుడి ఆవేదన అక్కడున్న వారిని కలచివేసింది. తన వెనుక సీటులో కూర్చున్న భార్య ప్రమాదంలో కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయిందంటూ ఆయన కన్నీరుమున్నీరయ్యారు. టీ విరామం అనంతరం బస్సు తిరిగి బయలుదేరిన గంటలోపే ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. ముందు సీట్లలో కూర్చున్న ప్రయాణికుల్లోనూ కొందరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే ఇనుప సామగ్రి బస్సులోకి దూసుకురావడంతో ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయని వివరించారు. "డ్రైవర్ నిర్లక్ష్యం, నిద్రమత్తులో బస్సు నడపడమే ఈ ఘోరానికి కారణం. నా కళ్ల ముందే నా భార్య ప్రాణాలు కోల్పోయింది" అంటూ బాధిత ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిలో 14 మందిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పలువురికి తల, ఛాతీ, కడుపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఇనుప సామగ్రి బలంగా తాకడంతోనే గాయాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి. అప్పటికే ప్రమాదానికి గురై రహదారిపై నిలిచిపోయిన లారీని ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సకాలంలో గుర్తించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

కోదాడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రయాణికుల భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు వ్యవహరించాలని సూచించారు.

# సర్కారుపై ఉద్యోగుల సమరం

**మొదటిపేజీ తరువాయి**

ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా రెండో వేతన సవరణ సంఘం నివేదికను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన సుమారు 6 డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉండటం వల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు. ఉద్యోగుల భవిష్యత్తు భద్రత కోసం పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని, సీపీఎస్ విధానంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లుల రూపంలో వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని, జీవో 317 బాధితుల సమస్యలు, ఆరోగ్య పథకం పూర్తి స్థాయిలో అమలు కాకపోవడం వల్ల వైద్య ఖర్చులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నేడు ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో నేడు గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా, అలాగే 33 జిల్లాల ఐడీఓసీల ముందు నిర్వహించనున్నట్లు టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. సుమారు రూ. 10వేల కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి నేటి మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ సమ్మిట్‌కు వార్ రూమ

**హైదరాబాద్, ఆగస్టు 26, సిరి న్యూస్:**

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2026, ఇన్వెస్ట్ తెలంగాణ' కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. సమ్మిట్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక 'వార్ రూమ' ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షించింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో వార్ రూమ్ పని చేసేలా ఏర్పాట్లు చేయాలని భట్టి సూచించారు. వార్ రూమ్ పనితీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షించాలని చెప్పారు. సమ్మిట్ కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన వివిధ కమిటీల్లో అవసరమైన నిపుణులు, కీలక అధికారులను భాగస్వాములను చేయాలని సూచించారు.

**ఆహ్వానాల్లో జాప్యం వద్దు**

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులను ఆహ్వానించేందుకు చర్యలు వేగవంతం చేయాలని భట్టి ఆదేశించారు. అతిథులకు ఆహ్వాన పత్రాలు పంపడంలో ఏమాత్రం ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఎవరెవరిని ఆహ్వానించాలి, వారితో సంప్రదింపులు ఏ స్థాయిలో ఉన్నాయి తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**దేశ విదేశాల్లో రోడ్‌షోలు**

డిసెంబర్‌లో జరగనున్న సమ్మిట్‌ను విజయవంతం చేయడం తో పాటు తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృత స్థాయిలో రోడ్‌షోలు నిర్వహించాలని భట్టి సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల విధానాలను పెట్టుబడిదారులకు వివరించేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు.



**గత ఒప్పందాల పురోగతి తేల్చండి**

గతంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా వివిధ సంస్థలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల పరిస్థితిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్ని ఒప్పందాలు కార్యరూపం దాల్చాయి, ఎన్ని ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి, ఎక్కడ జాప్యం జరుగుతోంది, పెట్టుబడులు ఎంతవరకు వచ్చాయన్న అంశాలపై సమగ్ర విశ్లేషణ చేయాలని భట్టి ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీకి బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

**రోజూ గంటపాటు సమీక్ష**

సమ్మిట్ ఏర్పాట్లలో జాప్యానికి తావులేకుండా ప్రతి కమిటీకి స్పష్టమైన కాలపరిమితి నిర్దేశించాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిరోజూ కనీసం గంటపాటు సమ్మిట్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కమిటీ తనకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత కాలపట్టిక ప్రకారం పూర్తి చేసేలా వార్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా మరింత బలంగా ఆవిష్కరించే లక్ష్యంతో సమ్మిట్ నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లకు అవకాశం ఇవ్వకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికార యంత్రాంగానికి భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.

# మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లు




**హైదరాబాద్, ఆగస్టు 26, సిరి న్యూస్:**

తెలంగాణలోని ప్రతి మీ సేవా కేంద్రాన్ని డిజిటల్ మార్కెటింగ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక వ్యాపారులకు డిజిటల్ ప్రచార అవకాశాలను చేరువ చేయడమే లక్ష్యంగా మీ సేవా-మెటా సంయుక్త కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని షెరటాన్ హోటల్‌లో బుధవారం మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ రెండో దశ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 140 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్లు (వీఎల్‌ఈలు) హాజరయ్యారు. వీరికి 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొత్త సాంకేతికతను స్వీకరించడంలో తెలంగాణ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. సమర్థవంతమైన పౌర సేవలను అందించడంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా మీ సేవా కేంద్రాలు ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా స్వీట్ షాపుల నుంచి టెక్స్ టైల్ స్టోర్స్, నైపుణ్య వృత్తిదారులు, ఇతర చిన్న వ్యాపారులకు డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలను చేరువ చేయవచ్చని వెల్లడించారు. వ్యాపారులు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఈ సేవ ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. మీ సేవా కేంద్రాలు పౌర సేవలకే పరిమితం కాకుండా ప్రజలకు డిజిటల్ అవగాహన కల్పించి, ఆదాయ అవకాశాలను పెంచే వేదికలుగా మారాలని తెలిపారు. కొత్త ఆలోచనలు, సేవలు, వ్యాపార అవకాశాలను తెలంగాణ ఎప్పుడూ స్వాగతిస్తుందని వెల్లడించారు. ప్రజల ఆదాయం, దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఇవి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తొలుత హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ/క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. సుమారు 120 మంది మీ సేవా వీఎల్‌ఈలకు డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ప్రకటనలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారిలో 10 మందికిపైగా ఇప్పటికే ప్రత్యక్ష డిజిటల్ ప్రకటనల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక వ్యాపారులకు ఇప్పటివరకు 17కుపైగా ప్రకటనలను రూపొందించి ప్రచురించారు. ఈ కార్యక్రమంతో వీఎల్‌ఈలకు కొత్త ఆదాయ మార్గం అందుబాటులోకి వచ్చింది. స్థానిక వ్యాపారులు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేదికల్లో తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసుకునే అవకాశం ఏర్పడింది. తొలి దశలో మంచి ఫలితాలు రావడంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తున్నారు. రెండో దశలో ప్రతి జిల్లా నుంచి నలుగురు నుంచి ఐదుగురు చొప్పున వీఎల్‌ఈలను ఎంపిక చేశారు. డిజిటల్ మార్కెటింగ్‌పై ప్రాథమిక అవగాహన, ఆసక్తి, స్థానిక వ్యాపారులతో సమర్థంగా సంప్రదించే సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేపట్టారు.

శిక్షణ పొందిన వీఎల్‌ఈలు తమ జిల్లాల్లో 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' పనిచేస్తారు. స్థానిక వ్యాపార అవసరాలను గుర్తించడం, డిజిటల్ మార్కెటింగ్ ప్రయోజనాలను వివరించడం, ప్రకటనల రూపకల్పనలో సహకరించడం, సరైన లక్ష్య వినియోగదారులను గుర్తించడం వంటి సేవలను అందిస్తారు. వ్యాపార విస్తరణలోనూ నిరంతర సహకారం అందించనున్నారు.

**మెటాతో ఎంఓయూ**

కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ), ఐటీ అండ్ సీ శాఖ, మెటా సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమంలో రెండు సంస్థల భాగస్వామ్యం అధికారికంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మీ సేవా కమిషనర్, ఈఎస్‌డీ అధికారి టి.రవికిరణ్, ఐఎఫ్ఎస్, మెటా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ అరుణ్ శ్రీనివాస్, స్ట్రాటజిక్ ప్రోగ్రామ్స్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ దివ్య ఖేమాని వధేరా, మీడియా, ట్రావెల్ అండ్ సర్వీసెస్ ఎకోసిస్టమ్ వర్టికల్ హెడ్ రిషాద్ చిందమడ తదితరులు పాల్గొన్నారు.

**కొత్త పోర్టల్, హెల్ప్‌లైన్ ప్రారంభం**

స్థానిక వ్యాపారులు మీ సేవా ద్వారా నేరుగా డిజిటల్ మార్కెటింగ్ సహాయం కోరేలా కొత్త సదుపాయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు.

**పోర్టల్: meeseva.telangana.gov.in**

**టోల్‌ఫ్రీ నంబర్లు: 1100 / 1800-425-1110**

ఈ సేవతో వ్యాపారులకు అందుబాటు ధరల్లో డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయి. వినియోగదారులు తమ ప్రాంతంలోని ఉత్పత్తులు, సేవలను సులభంగా గుర్తించగలుగుతారు. వీఎల్‌ఈలకు అదనపు ఆదాయ మార్గం ఏర్పడుతుంది. రాష్ట్రంలో డిజిటల్ వ్యాపార వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.

శిక్షణ పొందిన ప్రతి వీఎల్‌ఈ తొలుత ఒక వ్యాపారంతో పని ప్రారంభించి, ఆ తర్వాత పది, వంద వ్యాపారాలకు సేవలను విస్తరించేలా ముందుకు సాగాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి జిల్లాలో శిక్షణ పొందిన డిజిటల్ మార్కెటింగ్ వీఎల్‌ఈలు అందుబాటులో ఉండాలన్నది లక్ష్యమని వెల్లడించింది. ప్రతి స్థానిక వ్యాపారికి తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రచార సహాయం అందుబాటులోకి తేవాలని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమం అమలులో భాగస్వాములైన ఈఎస్‌డీ-మీ సేవా బృందం, మెటా ప్రతినిధులు, వీఎల్‌ఈల సేవలను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు.

# ప్రభుత్వ భూములను, ఆస్తులను తెగనమ్ముతున్న రేవంత్ ప్రభుత్వం

- **ఇప్పటికే రూ.30వేల కోట్ల విలువైన భూముల అమ్మకం**
- **హైదర్‌నగర్‌లో పిల్లల పార్కు స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టారు**
- **సామాన్యుల భూములను 22ఎలో చేర్చి వేధింపులు**
- **విలువైన ప్రభుత్వ భూములు సీఎం బంధుమిత్రులకు ధారాదత్తం**
- **ఇలా భూములు అమ్ముకుంటూ పోతే, రేపు పరిస్థితేంటి?**
- **కూకట్‌పల్లి 22ఎ బాధితులకు అండగా నిలుస్తాం**
- **మాజీ మంత్రి హరీష్‌రావు హామీ**



**హైదరాబాద్, ఆగస్టు 26, సిరి న్యూస్:**

'అసలు ఏ ఉద్దేశంతో ప్రభుత్వం ఈ 22ఎ ఆంక్షలను తీసుకొచ్చింది? ప్రభుత్వ బాధ్యత ఏమిటి? ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, ఉద్యోగాలు, రైతుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం.. ఆ సమస్యలను గాలికొదిలేసి కేవలం భూముల చుట్టూ ఎందుకు తిరుగుతోంది? ఒక్క మాటలో చెప్పాలంటే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలే కేంద్రంగా పరిపాలన సాగింది. కానీ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేవలం భూములే కేంద్రంగా పరిపాలన సాగుతోందని మాజీ మంత్రి హరీష్‌రావు (MLA Hairsh Rao) ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ ఎన్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాల్‌లో 22ఎ నిషేధిత భూముల సమస్యతో ఇబ్బంది పడుతున్న బాధిత కుటుంబాలతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు బుధవారం సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 22ఎ బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**టైమ్మేనేజ్‌మెంట్ క్యాలెండర్‌లను ఉపయోగించడం**

బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు హైదరాబాద్‌తో సహా రాష్ట్రమంతా కరెంటు కష్టాలు ఉండేవి. తాగునీరు, ట్రాఫిక్, సాగునీటి సమస్యలతో ప్రజలు అల్లాడిపోయారు. కానీ, కేసీఆర్ అధికారంలోకి రాగానే వాటన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి తాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎన్నో ఫ్లైఓవర్లు నిర్మించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచి, యువతకు ఉద్యోగాలు వచ్చేలా అద్భుతమైన ప్రగతిని సాధించారు. ఒకప్పుడు తెలంగాణ అంటే కరువు, రైతుల ఆత్మహత్యలు అనే పరిస్థితి ఉండేది. కానీ కేసీఆర్ పాలనలో.. గంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండి దేశంలోనే వరి ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంలో ఉన్న పంజాబ్, హర్యానా రాష్ట్రాలను సైతం తలదన్ని తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారు. కూకట్‌పల్లినే తీసుకుంటే.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇక్కడి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశాం. పెద్ద పెద్ద రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, మౌలిక వసతులు నిర్మించాం. నిజాం, బ్రిటిష్ కాలంలో కట్టిన ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులపైనే ఆధారపడే పరిస్థితిని మార్చేసి.. నగర నలువైపులా టిమ్స్ ఆసుపత్రులు నిర్మించాం. ఒక్క కూకట్‌పల్లిలోనే 20కి పైగా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశాం. కేసీఆర్ ఆలోచనలన్నీ పేదల కోసం కల్యాణలక్ష్మి, వృద్ధులకు ఆసరా పెన్షన్లు, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, బస్తీ దవాఖానాలు, మిషన్ భగీరథ, 24 గంటల విద్యుత్, రైతాంగానికి సాగునీరు.. ఇలా సాగాయని గుర్తుచేశారు.

ఇవే బీఆర్ఎస్ పదేళ్ల సువర్ణ పాలనకు గుర్తులు. మరి ఈరోజు రేవంత్ రెడ్డి పాలనలో పరిస్థితి ఏమిటి? ప్రజల సమస్యలు పరిష్కరించడం కంటే, ప్రభుత్వ భూములను అమ్ముకోవడానికే ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. హౌసింగ్ బోర్డు భూములు, టీజీఐఐసీ భూములు.. ఇలా ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తే అక్కడ బోర్డు పాతేసి అమ్మకానికి పెట్టడమే కాంగ్రెస్ విధానంగా మారింది. ప్రభుత్వ భూములు అంటే మన భవిష్యత్ తరాల ఆస్తి, అవి అమ్ముకోవడా నికి కాదు. హైదర్ నగర్‌లో కిషన్ రావు , అక్కడి కాలనీవాసులు పోరాడితే పిల్లలు ఆడుకోవడానికి కేసీఆర్ వెయ్యి గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దుర్మార్గమైన రేవంత్ రెడ్డి సర్కార్ ఆ పార్కు స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టింది. బీఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వ హయాంలో హౌసింగ్ బోర్డుకు చెందిన ఒక్క గజం భూమిని కూడా అమ్మకానికి పెట్టలేదు. కానీ, రేవంత్ రెడ్డి రాగానే ఈ తక్కువ కాలంలోనే సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను తెగనమ్మేశాడు.

ఇలా అడ్డగోలుగా భూములన్నీ అమ్ముకుంటూ పోతే.. రేపటి భవిష్యత్ తరాలకు ఒక దేవాలయం, మసీదు, చర్చి నిర్మించాలన్నా, ఆసుపత్రి, పాఠశాల, వాటర్ ట్యాంక్ కట్టాలన్నా.. కనీసం చనిపోతే దహన సంస్కారాలకు వైకుంఠధామం నిర్మించడానికి కూడా స్థలం దొరకని పరిస్థితి వస్తుంది. ఒకవైపు ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతూనే, మరోవైపు దళితులు, గిరిజనులు, బీసీ వర్గాలకు గతంలో కేటాయించిన అసైన్డ్ భూములపై కన్నేశారు. లక్షలాది మంది పేదలకు భరోసాగా ఉన్న ఆ భూములను లాక్కొని దళారుల ద్వారా కమీషన్లకు కట్టబెడుతున్నారు. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని కొనుక్కున్న సామాన్యుల భూములను మాత్రం రాత్రికి రాత్రే 22ఎ నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను వేధిస్తున్నారు. కానీ, ప్రభుత్వ ఆస్తులైన అత్యంత విలువైన భూములను మాత్రం సీఎం తన కుటుంబ సభ్యులకు, అనుయాయులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. 22ఎ బాధితుల పక్షాన, సామాన్యుల ఆస్తుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచైనా సరే రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# మేము ప్యూర్ కాంగ్రెస్

**హైదరాబాద్, ఆగస్టు 27, సిరి న్యూస్:**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో తన భేటీ నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే జరిగిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో భట్టిని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై విమర్శలు చేస్తున్నవారు ముందుగా తనను ఎందుకు విమర్శిస్తున్నారో, తమ స్థాయి ఏమిటో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తాను కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తి లేదని, పార్టీ బలోపేతం కోసమే తన గళం వినిపిస్తానని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ కోసం పోరాడా**

తాను కాంగ్రెస్‌లో సీనియర్ నేతల్లో ఒకడినని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పార్టీ కష్టకాలంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన వారిలో తానొకడినని చెప్పారు. 2018 ఎన్నికల్లో పెద్దపెద్ద నేతలు ఓటమి పాలైనా మునుగోడు ప్రజలు తనను గెలిపించారని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్రయత్నించిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా సర్వస్వం ధారపోసి పోరాడానన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నానని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నానని పేర్కొన్నారు.

**నిజమైన కార్యకర్తలకు అండగా**

తాను తెలంగాణ కోసం ఎంతో పోరాడానని, పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వ్యక్తిగతంగా సీఎం రేవంత్‌రెడ్డిని గానీ, ఇతర నాయకులను గానీ విమర్శించలేదని చెప్పారు. ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చిన వారికి టికెట్లు ఇచ్చి, వారు గెలిచిన తర్వాత నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరుగుతోందని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ, అధిష్ఠానంపై ఉందని చెప్పానన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికీ చెబుతున్నానని తెలిపారు.

**రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం**

తాను ఏది మాట్లాడినా పార్టీని బలోపేతం చేయడానికేనని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. పార్టీని బలహీనపరిచేలా తాను ఎప్పుడూ మాట్లాడబోనన్నారు. తెలంగాణ కోసం నిజాయితీగా పోరాడిన ఉద్యమకారులు ఎంతో మంది ఉన్నారని, ఇతర పార్టీల నుంచి వచ్చినవారు ఉన్నత పదవుల్లో ఉండవచ్చని పేర్కొన్నారు. అయితే అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను కించపరిచేలా కథనాలు రాయడం సరికాదన్నారు. మాది ప్యూర్ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు.

**అధిష్ఠానం నిర్ణయమే తుది**

కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన రాజగోపాల్‌రెడ్డి.. ఈ వ్యవహారంలో అధిష్ఠానం నిర్ణయమే తుది అని అన్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కూడా చెప్పారని, ఈ అంశంలో సీఎం మాటే తన మాట అని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై లోతుగా పరిశీలించి పీసీసీకి నివేదిక ఇచ్చిందని తెలిపారు. నివేదిక ఆధారంగా అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని ఎవరూ కాదనలేరని పేర్కొన్నారు.





# ఇంటి ఆడబిడ్డగా కవిత

- **ముదిరాజ్ కుటుంబ వివాహ వేడుకలో ఆత్మీయత**
- **బాలప్రసాద్ కోరిక మేరకు ఆడపడుచుగా వ్యవహారం**
- **సంప్రదాయం ప్రకారం వధువు మెడలో మూడు ముళ్లు**
- **గౌరీ పూజలో పాల్గొని వధువును ఆశీర్వదించిన కవిత**
- **ఆత్మీయంగా సాగిన వివాహ వేడుక**

**హైదరాబాద్, ఆగస్టు 27, సిరి న్యూస్:**

రాజకీయ నాయకులు సాధారణంగా సభలు, సమావేశాలు, ప్రజా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతుంటారు. అయితే తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఓ వివాహ వేడుకలో కుటుంబ సభ్యురాలిగా మారి ఆత్మీయత చాటుకున్నారు. పార్టీ నాయకుడు బాషబోయిన బాలప్రసాద్ కోరిక మేరకు ఆయన కుటుంబానికి చెందిన ఇంటి ఆడబిడ్డగా వ్యవహరించి వివాహ వేడుకను దగ్గరుండి నిర్వహించారు. ఈసీఐఎల్ కీసర క్రాస్‌రోడ్డులోని ఆరాధ్య కన్వెన్షన్‌లో ఈ వేడుక జరిగింది.

**సంప్రదాయం ప్రకారం మూడు ముళ్లు**

యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామానికి చెందిన బాషబోయిన బాలప్రసాద్ తెలంగాణ రక్షణ సేనలో కీలకంగా పనిచేస్తున్నారు. తెలంగాణ జాగృతిలోనూ ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. సీతాఫల్‌మండికి చెందిన శివానితో ఆయన వివాహం బుధవారం ఉదయం జరిగింది. బాలప్రసాద్‌కు అక్కాచెల్లెళ్లు లేకపోవడంతో తన కోరిక మేరకు కవిత ఆడపడుచుగా వివాహ సంప్రదాయాల్లో పాల్గొన్నారు.

ముదిరాజ్ కులాచారం ప్రకారం వరుడు వధువు మెడలో మంగళసూత్రం కట్టడానికి ముందు ఆడపడుచుతో పసుపు కొమ్ము దారంతో మూడు ముళ్లు వేయిస్తారు. ఈ సంప్రదాయాన్ని అనుసరించిన కవిత గౌరీ పూజలో పాల్గొని శివాని మెడలో పసుపు కొమ్ముదారంతో మూడు ముళ్లు వేశారు. అనంతరం ఆమెకు ప్రదానపు ఉంగరం తొడిగి, ఒడిబియ్యం పోసి ఆశీర్వదించారు.

**ఆత్మీయంగా వివాహ వేడుక**

కవిత ఆశీర్వాదాల అనంతరం బాలప్రసాద్ శివాని మెడలో మంగళసూత్రం ధరింపజేశారు. రాజకీయ అనుబంధాలకు అతీతంగా కుటుంబ సభ్యురాలిగా కవిత వివాహ వేడుకలో పాల్గొనడం అక్కడి వారిని ఆకట్టుకుంది. తమ నాయకుడి కోరికను మన్నించి ఇంటి ఆడబిడ్డగా వ్యవహరించిన కవితకు బాలప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కౌశిక్‌రెడ్డిపై ఎథిక్స్ కమిటీ విచారణ

- **29న అసెంబ్లీ కమిటీ హాల్‌లో కీలక భేటీ**
- **కడియం శ్రీహరిపై వ్యాఖ్యలు, ప్రవర్తనపై విచారణ**
- **స్పీకర్ ఆదేశాలతో వ్యవహారం కమిటీకి**
- **తదుపరి చర్యలపై నివేదిక, సిఫారసులు**
- **కమిటీ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ**

**హైదరాబాద్, ఆగస్టు 27, సిరి న్యూస్:**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై వచ్చిన అనైతిక ప్రవర్తన, అనుచిత వ్యాఖ్యల ఫిర్యాదుపై తెలంగాణ శాసనసభ నైతికత కమిటీ ఈనెల 29న విచారణ చేపట్టనుంది. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్‌లో సమావేశం జరగనుంది. గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, సభలో ఆయన వ్యవహరించిన తీరుపై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ఈ విచారణ కొనసాగనుంది.

**స్పీకర్ ఆదేశాలతో కమిటీకి**

బడ్జెట్ సమావేశాల సమయంలో కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు, ప్రవర్తనపై అధికారపక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఈ వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు సూచించేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నైతికత కమిటీకి పంపించారు. విచారణను వేగవంతం చేస్తూ శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి కమిటీ సమావేశానికి సంబంధించి అధికారికంగా లేఖ జారీ చేశారు.

**చర్యలపై సిఫారసులు**

29న జరిగే సమావేశానికి కమిటీ ఛైర్మన్‌తో పాటు సభ్యులు హాజరై కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై వివరంగా చర్చించనున్నారు. ఘటనకు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యేపై తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై నివేదిక రూపొందించి, అవసరమైన సిఫారసులు చేయనున్నారు. కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# హిడ్మా గన్‌మెన్ సరెండర్

- **ముచ్చిక మంగితో పాటు మరో ఇద్దరు లొంగుబాటు**
- **హిడ్మాకు అత్యంత నమ్మకమైన రక్షకురాలిగా గుర్తింపు**

**పోలవరం, ఆగస్టు 27, సిరి న్యూస్:**

మావోయిస్టు పార్టీకి కీలక ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు అగ్రనేత మడావి హిడ్మాకు వ్యక్తిగత గన్‌మెన్‌గా పనిచేసిన ముచ్చిక మంగి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆమెతో పాటు మరో ఇద్దరు దళ సభ్యులు లక్ష్మయ్య, ఎంకా కూడా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. పోలవరం జిల్లా ఓఎస్డీ పంకజ్‌కుమార్ మీనా ఎదుట ముగ్గురూ అధికారికంగా లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు.

**హిడ్మాకు నమ్మకమైన రక్షకురాలు**

ముచ్చిక మంగి మావోయిస్టు దళాల్లో చాలాకాలంగా చురుగ్గా పనిచేస్తూ హిడ్మాకు అత్యంత నమ్మకమైన రక్షకురాలిగా వ్యవహరించినట్లు పోలీసులు వెల్లడించారు. పీఎల్‌జీఏ సభ్యురాలిగా పనిచేసిన ఆమె భద్రతా బలగాలతో జరిగిన ఏడు భారీ ఎన్‌కౌంటర్లలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు తెలిపారు. మారుతున్న పరిస్థితులు, భద్రతా బలగాల ముమ్మర నిఘా నేపథ్యంలో మావోయిస్టు కార్యకలాపాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

**పునరావాసం కల్పిస్తాం**

ఆయుధాలు వీడి శాంతియుత జీవితం వైపు అడుగులు వేసిన మంగి, లక్ష్మయ్య, ఎంకాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పరిహారం, పునరావాస పథకాలను వర్తింపజేస్తామని పోలీసులు తెలిపారు. హిడ్మాకు అత్యంత సన్నిహితంగా పనిచేసిన మంగి లొంగిపోవడం ఏజెన్సీ ప్రాంతాల్లో మావోయిస్టు దళాలకు గట్టి దెబ్బగా భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. పోలీసుల ముమ్మర గాలింపు చర్యలతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస అవకాశాలతో పలువురు దళ సభ్యులు వరుసగా లొంగిపోతున్నారని అధికారులు తెలిపారు.



# భారత్ ధర్మశాల కాదు!

- దేశంలో నివసించే హక్కు పౌరులకే: అమిత్ షా
- అక్రమ చొరబాట్లపై ఉక్కుపాదం మోపాలని భద్రతా సంస్థలకు దిశానిర్దేశం
- అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తి చేయడమే లక్ష్యమని వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 26 సిరి న్యూస్:**

"భారత్ ధర్మశాల కాదు.. ఈ దేశంలో నివసించే హక్కు దేశ పౌరులకే ఉంటుంది" అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేయాల్సిందేనని అన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన జాతీయ భద్రతా వ్యూహ సదస్సు ముగింపు సమావేశంలో అమిత్ షా పాల్గొని దేశ భవిష్యత్ భద్రతా వ్యూహంపై కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లకు స్పందించడంతోనే సరిపెట్టకుండా రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో దేశ భద్రతను ప్రభావితం చేయగల పరిణామాలను ఇప్పటి నుంచే అంచనా వేయాలని భద్రతా, నిఘా సంస్థలకు సూచించారు. అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు తదితర సవాళ్లను ముందుగానే గుర్తించి అడ్డుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అక్రమ వలసలు కేవలం శాంతిభద్రతలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, దేశ ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**సరిహద్దులపై మరింత నిఘా**


దేశ భూ సరిహద్దుల రక్షణను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అమిత్ షా తెలిపారు. గత ఎనిమిది నెలల్లో సరిహద్దులు కలిగిన అన్ని రాష్ట్రాలతో కేంద్రం చర్చలు జరిపిందని చెప్పారు. సరిహద్దు భద్రత కోసం నాలుగు స్తంభాలతో కూడిన వ్యవస్థను రూపొందించినట్లు వెల్లడించారు. సరిహద్దుల వద్ద అక్రమ చొరబాట్లను గుర్తించడం, వాటిని అడ్డుకోవడం, నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం, కేంద్రరాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. "దేశ భద్రత విషయంలో రాజీకి తావులేదు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించేవారిని గుర్తించి అడ్డుకోవాలి. సాధ్యమైనంత తక్కువ సమయంలో భారత్‌ను అక్రమ చొరబాట్ల సమస్య నుంచి విముక్తి చేయడమే లక్ష్యం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

## అమెరికా బెదిరింపులను ఎవరూ లెక్క చేయరు

- ఇరాన్ స్పీకర్ మహ్మద్ బాగేర్ గాలిబఫ్ హెచ్చరిక

**టెహ్రాన్, ఆగస్ట్ 26, సిరి న్యూస్:**

ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలపై మరిన్ని ఆంక్షలు విధిస్తామనే అమెరికా హెచ్చరికలపై ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ఇతర దేశాలను శాసించే స్థితిలో లేదని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రపంచ దేశాలపై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా పెద్ద పెద్ద హెచ్చరికలు చేస్తుంటుందని, వాటిని ప్రపంచంలోని ఏ దేశాలూ పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు. ఆ విషయం అమెరికాకు కూడా తెలుసని ఎద్దేవా చేశారు. ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలు.. తమ వైఖరిని స్పష్టంగా తెలిపాయని గాలిబఫ్ చెప్పారు. ఇటీవల అమెరికా మంత్రి స్కాట్ బెసెంట్ ఇరాన్‌తో ఆర్థిక లావాదేవీలు కొనసాగించే దేశాలు, సంస్థలపై కొత్త ఆంక్షలు విధిస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచే చర్యలకు అమెరికా శ్రీకారం చుట్టింది. అయితే అమెరికా ఒత్తిళ్లకు తాము తలొగ్గబోమని గాలిబఫ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఇరాన్`అమెరికా మధ్య ఆర్థిక, దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## ఢిల్లీని వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ

- ఇప్పటివరకు 2,308 హెచ1ఎన1 కేసులు
- మూడు వేలు దాటిన మొత్తం ఇన్‌ఫ్లుయెంజా కేసులు
- నాలుగైదు రోజులుగా అమాంతం పెరుగుతున్న బాధితులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25, సిరి న్యూస్:**

దేశ రాజధాని ఢిల్లీని స్వైన్‌ఫ్లూ వణికిస్తోంది. నగరంలో హెచ1ఎన1 కేసులు వేగంగా పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెల కొంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఢిల్లీలో 2,308 స్వైన్‌ఫ్లూ కేసులు నమోద య్యాయి. మొత్తంగా వివిధ రకాల ఇన్‌ఫ్లుయెంజా కేసుల సంఖ్య మూడు వేలు దాటింది. ముఖ్యంగా గత నాలుగైదు రోజులుగా హెచ1ఎన1 కేసులు ఒక్కసారిగా పెరుగుతున్నట్లు సమాచారం. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో పలు ఆస్పత్రుల్లో రోగుల రద్దీ కనిపిస్తోంది. స్వైన్‌ఫ్లూ కేసులు పెరు గుతున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. హెచ1ఎన1 బాధితులకు ప్రత్యేకంగా చికిత్స అందించేందుకు ప్రతి ఆస్పత్రిలో ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేఖాగుప్తా అధికారులను ఆదేశించారు. కేసుల పెరుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మందులు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అయితే ప్రస్తుతం ఢిల్లీలో వ్యాపిస్తున్న హెచ1ఎన1 వైరస్ కొత్త రకం కాదని భారత వైద్య పరిశోధన మండలి, ఢిల్లీ ఎయిమ్స్ వైద్య నిపుణులు పేర్కొన్నారు. ప్రజలు అనవసరంగా భయాందోళనలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.





# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

- వందలాది మంది గల్లంతు!
- టిబెట్‌లో భూకంపం, విరిగిపడిన మంచుచరియలతో ఉప్పొంగిన భోటేకోశీ నది
- గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు స్త్ర బిహార్, యూపీలకు అలర్ట్
- నేపాల్ ప్రధానికి ప్రధాని మోదీ ఫోన్ స్త్ర తక్షణ సహాయక చర్యలకు హామీ

**ఖాట్మండు, ఆగస్టు 26, సిరి న్యూస్:**

నేపాల్‌పై ప్రకృతి విరుచుకుపడింది. టిబెట్ వైపు నుంచి ఒక్కసారిగా పోటెత్తిన వరద భోటే కోశీ నదిని మహోగ్రరూపంలోకి మార్చింది. చైనా సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలో బుధవారం ఉదయం సంభవించిన ఆకస్మిక వరదలు గ్రామాలను ముంచెత్తి, ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేశాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లంతైనట్లు సమాచారం. వీరిలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తలు రావడంతో ఆందోళన మరింత పెరిగింది. అయితే గల్లంతైన వారి సంఖ్యపై భిన్నమైన అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో అధికారిక నిర్ధారణ కోసం ఎదురు చూడాల్సి ఉంది. భోటే కోశీ నది ఒక్కసారిగా ఉప్పొంగడంతో నదీ తీర ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఉద్ధృతంగా వచ్చిన నీరు తన దారిలో ఉన్న నిర్మాణాలను కొట్టుకుపోయింది. నువాకోట్, ధాడింగ్ సహా పలు ప్రాంతాలపై వరద ప్రభావం పడింది. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు భద్రతా బలగాలు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగాయి. హెలికాప్టర్లతో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు హెచ్చరించారు.

**టిబెట్ నుంచి వచ్చిన జలవిలయం?**

నేపాల్‌లో స్థానికంగా భారీ వర్షాలు పడతాయని ముందస్తు అంచనాలు లేకపోయినా టిబెట్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు, కొండచరియలు ఈ విపత్తుకు కారణమై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపగ్రహ చిత్రాల్లో సరిహద్దుకు సమీపంలోని పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడిన ఆనవాళ్లు కనిపించినట్లు సమాచారం. టిబెట్‌లో పుట్టే లేండే నది నేపాల్‌లోకి ప్రవేశించి భోటే కోశీలో కలుస్తుంది. ఎగువ ప్రాంతంలో మంచు, కొండచరియలు నదీ ప్రవాహానికి అడ్డుపడి భారీగా నీరు నిలిచిపోయి, ఆ సహజ అడ్డుకట్ట ఒక్కసారిగా తెగిపోవడంతో నీరు దిగువకు దూసుకొచ్చి ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు.

**భూకంపంతో కొండచరియలు?**

ఇదే సమయంలో టిబెట్‌లో సంభవించిన భూకంపానికి వరదలకు సంబంధం ఉందా అన్న కోణంలోనూ పరిశీలన సాగుతోంది. భూకంపం కారణంగా కొండచరియలు విరిగిపడి నదీ ప్రవాహానికి అడ్డుకట్ట ఏర్పడి, అనంతరం అది తెగిపోవడంతో వరద పోటెత్తి ఉండవచ్చన్న ప్రాథమిక అంచనాలు వెలువడుతున్నాయి. భారీ వర్షాలు, మంచుచరియలు, కొండచరియలు, భూకంపం.. వీటిలో ఏది ప్రధాన కారణమన్నది పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే తేలనుంది. హిమాలయ ప్రాంతాల్లో భూతాపం పెరగడం వల్ల హిమనదాలు వేగంగా కరుగుతున్నాయని, ఫలితంగా పర్వతాలపై అస్థిరమైన హిమసరస్సులు ఏర్పడుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొండచరియలు విరిగిపడినా, అధిక వర్షపాతం నమోదైనా ఇటువంటి సరస్సులు ఒక్కసారిగా తెగిపోయి దిగువ ప్రాంతాలపై జలప్రళయాన్ని సృష్టించే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

**భారీగా ఆస్తి నష్టం**

వరదల కారణంగా ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. అనేక ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సహాయక బృందాలు చేరుకోవడానికే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గల్లంతైన వారి కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. గాయపడిన వారిని అందుబాటులో ఉన్న వైద్య కేంద్రాలకు తరలిస్తున్నారు.

**భారత్ వైపు దూసుకొచ్చే ప్రవాహం**

భోటే కోశీ దిగువకు ప్రవహిస్తూ త్రిశూలీ నదిగా మారి, దేవఘాట్ వద్ద కాళీ గండకి నదిలో కలుస్తుంది. అక్కడి నుంచి నారాయణి పేరుతో ప్రవహించి భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత గండక్ నదిగా పిలుస్తారు. ఈ నది బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాల మీదుగా చివరకు గంగలో కలుస్తుంది. దీంతో నేపాల్‌లో సంభవించిన వరద ప్రభావం దిగువ ప్రాంతాలపై పడే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని భారత్‌లోనూ అప్రమత్తత పెంచారు.

**బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో అప్రమత్తత**

నేపాల్ వరదల నేపథ్యంలో గండక్, నారాయణి నదుల్లో నీటిమట్టాల పెరుగుదలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. బిహార్‌లో ఆనకట్టలు, కరకట్టలపై నిరంతర నిఘా పెట్టాలని, రాత్రి వేళల్లోనూ గస్తీ నిర్వహించాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు ఇచ్చి, అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలను రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ ముఖ్యంగా మహారాజ్‌గంజ్, కుషీనగర్ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. నదుల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

### నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్

- వరదలపై ఆరా తీసిన భారత ప్రధాని
- సహాయ సిబ్బందిని పంపుతామని హామీ

న్యూఢిల్లీ,ఆగస్ట26 : భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు. ఉద్ధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జ్‌లు, ప్రాజెక్ట్‌లు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది.

# రష్యాలో ఇంటెలిజెన్స్ చీఫ్ పర్యటన

- సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్.. మాస్కోలో రహస్య పర్యటన

**వాషింగ్టన్, ఆగస్ట్ 26, సిరి న్యూస్:**

ఉక్రెయిన్`రష్యా మధ్య ఘర్షణలు తీవ్ర స్థాయిలో కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నిఘా సంస్థ సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్.. మాస్కోలో రహస్యంగా దౌత్య పర్యటన చేపట్టారు. ఈ మేరకు అంతర్జాతీయ వి□డియా కథనాలు వెల్లడించాయి. నిన్న రష్యాలో అగ్రరాజ్య సైనిక విమానం ఒకటి ల్యాండ్ అవడం మిస్టరీగా మారిన సంగతి తెలిసిందే. ఆ విమానంలో వచ్చింది రాట్‌క్లిఫ్ అని తాజాగా బయటికొచ్చింది. రాట్‌క్లిఫ్ పర్యటనకు ముందు మాస్కోపై డ్రోన్లు, క్షిపణి దాడులు ఆపాలని ఉక్రెయిన్‌ను అమెరికా కోరింది. తమ సీనియర్ అధికారి ఒకరు రష్యాలో పర్యటించ నున్నారని గత సోమవారం అగ్రరాజ్యం నుంచి తమకు సమాచారం వచ్చిందని కీవ్ వెల్లడించింది. దాదాపు 8 గంటల పాటు సీఐఏ చీఫ్ మాస్కోలో ఉన్నట్లు విమానాల ట్రాకింగ్ డేటా తెలిపింది. అయితే, ఈ పర్యటనకు ఆయన సైనిక రవాణా విమానాన్ని ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. భద్రతా కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా మిలిటరీ విమానం బోయింగ్ సి`17 గ్లోబ్‌మాస్టర్`3.. వ్నూకోవ్ విమానాశ్రయంలో దిగగానే దౌత్య నంబరు ప్లేట్లతో ఉన్న కాన్వాయ్ అక్కడకు చేరుకున్నట్లు పలు వి□డియా కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ పర్యటనలో రాట్‌క్లిఫ్ ఎవరిని కలిశారన్నది మాత్రం తెలియరాలేదు. దీనిపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందించారు. ఆ విమానం గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని, క్రెమ్లిన్‌లో ఈ వారం అమెరికా ప్రతినిధులతో సమావేశాలకు సంబంధించి ప్రణాళికలు కూడా లేవని పేర్కొన్నారు. అటు అమెరికా సీఐఏ కార్యాలయం ఈ కథనాలపై స్పందించలేదు. ఉక్రెయిన్`రష్యా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న వేళ సీఐఏ చీఫ్ మాస్కోకు రావడం చర్చనీయాంశమైంది. ఆయన ఎందుకొచ్చారన్నదానిపై అనేక ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌ను ఒంటరి చేయడమే లక్ష్యంగా అమెరికా 'ఆపరేషన్ ఎకనమిక్ అవుట్‌కాస్ట'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అంటే టెహ్రాన్‌తో వ్యాపారం సాగించే సంస్థలు, దేశాలను లక్ష్యంగా చేసుకుని పలు ఆంక్షలు విధించనుంది. ఇరాన్‌కు రష్యా వ్యూహాత్మక వాణిజ్య భాగస్వామిగా ఉంది. మరోవైపు, నాటో సభ్య దేశంలో రష్యా దాడి చేసే అవకాశం ఉందని అమెరికా నిఘా సంస్థ ఇటీవల హెచ్చరించింది. నాటో దేశంపై మాస్కో సైబర్ దాడులు, కోవర్ట్ ఆపరేషన్‌లు లేదా చిన్న స్థాయి సైనిక దురాక్రమణ చేపట్టే ప్రమాదం ఉన్నట్లు తెలిపింది. దాని గురించి చర్చించేందుకు సీఐఏ చీఫ్ వచ్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. సీఐఏ అధిపతులు ఇలా రష్యాలో దౌత్య పర్యటనలు చేపట్టడం తొలిసారి కాదు. బైడెన్ హయాంలో 2021 నవంబరులో నాటి సీఐఏ చీఫ్ విలియం బర్న్స్ మాస్కోలో పర్యటించారు. ఉక్రెయిన్‌పై భీకర యుద్ధానికి రష్యా సన్నాహాలు చేస్తోన్న సయమంలో ఆ పర్యటన చోటుచేసుకుంది. నాడు సీఐఏ డైరెక్టర్ నేరుగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం జరిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం జరిపితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అయితే, అగ్రరాజ్యం మాటను పెడచెవిన పెట్టిన మాస్కో.. 2022 ఫిబ్రవరిలో కీవ్‌పై సైనిక చర్య ప్రారంభించిన సంగతి తెలిసిందే.

## ఇరాన్‌పై కొత్తగా దాడులు చేయబోం

- విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడి

**వాషింగ్టన్, ఆగస్ట్ 26, సిరి న్యూస్:**

పశ్చిమా సియాలో అమెరికా`ఇరాన్ మధ్య పరస్పర దాడులు ప్రస్తుతానికి ఆగినా.. యుద్ధ మేఘాలు మాత్రం తొలగిపోలేదు. ఇరాన్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి వేరుచేసేలా ఆంక్షలు విధించిన అగ్రరాజ్యం తాజాగా కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతానికి ఇరాన్‌పై కొత్తగా దాడులు ఉండవని విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. మిత్రదేశాలకు ఈ విషయాన్ని తెలియజేసి నట్లు అంతర్జాతీయ వి□డియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఇరాన్ వైపు నుంచి మళ్లీ దాడులు ప్రారంభమయితే అమెరికా సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేమని అధికారులు వెల్లడించారు. దాడులు ఉండవని చెప్పినప్పటికీ.. ఇరాన్ ఓడరేవుల నుంచి నౌకల రాకపోకలను కట్టడిచేసేలా హర్మూజ్‌లో దిగ్బంధాన్ని అమెరికా కొనసాగిస్తోంది. మరోవైపు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నడ్డివిరిచేలా కొత్త ఆంక్షలతో విరుచుకుపడింది. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల (జ□ం బజీనిఇబితినీనిబ నీని ఎసజీని) లక్ష్యమని య□ఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్న సంగతి తెలిసిందే

# అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**కెనడా, ఆగస్ట్ 26, సిరి న్యూస్:**

అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమవుతోంది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించింది. 27.6 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన.. 700లకు పైగా అమెరికా వస్తువులపై టారిఫ్‌లు విధిస్తున్నట్లు ఆ దేశ పరిశ్రమల శాఖ మంత్రి ఫ్రాంకోయిస్`ఫిలిప్ షాంపేన్ ప్రకటించారు. 25 శాతం సుంకాలు ఉన్న వస్తువుల్లో గృహోపకరణాలు, జున్ను వంటి పాల ఉత్పత్తులు, చేపలు, సముద్రపు ఆహారం వంటివి ఉన్నాయి. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులతో పాటు ఫర్నిచర్, వ□స్త్రాలకు అత్యధికంగా 50 శాతం సుంకాలు అమల్లోకి రానున్నాయి. మరికొన్ని వస్తువులు, ఉత్పత్తులపై 15, 25 శాతం చొప్పున ప్రతిసుంకాలు విధించింది. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ తాజా ప్రకటన వెలువడింది. అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలతో పాటు, దేశీయ వ్యాపారాలు, కార్మికుల కోసం కెనడా 7.5 బిలియన్ కెనడియన్ డాలర్లతో సహాయ ప్యాకేజీని ప్రకటించింది. 'అమెరికా ప్రతిపాదించిన కొత్త నిబంధనలు కెనడా ప్రయోజనాలకు అనుకూలంగా లేవు. కెనడా నుంచి ఎక్కువ ఆశిస్తున్న అగ్రరాజ్యం.. ప్రతిఫలంగా మాకు చాలా తక్కువ వనరులను ఇస్తోంది. అందువల్లే మా కార్మికులు, వ్యాపారాలు, వ్యూహాత్మక రంగాలు.. జాతీయ ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండేందుకు ఆ దేశంతో చర్చలు నిలివేశాం' అని కెనడా ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కెనడా దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటోందని మరోవైపు అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌస్ ఆరోపించింది. తాజా సుంకాలతో ట్రంప్ దాని దోపిడీకి ముగింపు పలికారని తెలిపింది. వివక్షపూరితమైన ఆ దేశ వాణిజ్య పద్ధతులను ఇకపై తాము అంగీకరించబోమని స్పష్టం చేసింది.

## పి ఆర్ టి యు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, సురేష్




**పాపన్నపేట ఆగస్ట్ 26 సిరి న్యూస్ :**

మండల పి ఆర్ టి యు అధ్యక్ష, కార్యదర్శులుగా పంతులు రాజు ,దాసరి సురేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం ప్రాథమికోన్నత పాఠశాల ఎల్లాపూర్ లో ఏర్పాటుచేసిన మండల పి ఆర్ టి యు సర్వసభ్య సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా సంతోష్ కుమార్, ఫసియొద్దీన్, మహిళ అసోసియేట్ అధ్యక్షులుగా స్వరూపారాణి, లక్ష్మి, ఉపాధ్యక్షులుగా సిద్దయ్య, నాగేశ్వర్, మహిళా ఉపాధ్యక్షులుగా శ్రావణి, అశ్విని, కార్యదర్శులుగా సురేష్, నవీన్ కుమార్, మహిళా కార్యదర్శులుగా చంద్రకళ, శ్రావణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల కు రావాల్సిన పెండింగ్ బకాయిలు, డిఏలు ,పిఆర్సి వెంటనే ప్రకటించాలని సిపిఎస్ ను రద్దు చేయాలని, జీవో నెంబర్ 25న రద్దుచేసి ప్రాథమిక తరగతులకు తరగతి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1న పి ఆర్ టి యు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సతీష్ రావు, సామ్యా నాయక్ సంఘ పెద్దలు వెంకట్రాంరెడ్డి, సుంకరి కృష్ణ, సబ్బని శ్రీనివాస్, మహేష్, తాళ్ల శ్రీనివాస్, అంజనా చారి, భవాని ప్రసాద్, సతీష్ గౌడ్, ప్రభాకర్ రావు, పోచయ్య, రాజయ్య, ప్రవీణ్, రాఘవేందర్, టేక్మాల్ అధ్యక్షులు అమీరుద్దీన్, మెదక్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారులుగా భీమ్లా నాయక్ రాఘవేందర్ లు వ్యవహరించారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు నోటిని అదుపులో పెట్టుకోవాలి

### రంగంపేటలో శనివారం నాడు చర్చకు సిద్ధం



**కొల్చారం ఆగస్టు 26 (సిరి న్యూస్)**

BRS ,కాంగ్రెస్ నేతల ఆరోపణలు,ప్రత్య రోపణలతో కొల్చారం మండలంలో రాజకీయ వాతావరణం హిట్ ఎక్కింది. ఒకరిపై ఒకరు వ్యక్తి ఆరోపణలతో వాతావరణం చిలికి చిలికి గాలివానలా మారింది.

30 యేండ్లుగా రాజకీయల్లో ఉన్న అరిగే రమేష్ ,పై గ్రామంలో వార్డు సభ్యుడిగా సైతం గెలువాని యేళ్లుగారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడం ఏమిటని రంగంపేట మాజీ సర్పంచ్ అరిగే విజయ్, BRS నేతలు చిట్కూల్ సురేష్, గంగారములు, ఉసికే సుధాకర్, ఉసికే మల్లేశం ,ఎలుక గంగయ్య అన్నారు. బుధవారం నాడు కొల్చారం మండలం రంగంపేట లో BRS నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ అరిగే రమేష్ ను కబ్జా కోరు అన్న మాటలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. రమేష్ ఎక్కడ కబ్జా చేశాడు ఆధారాలు చూపాలని BRS నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్య గౌడ్, రాజు,జీవులు, మల్లేశం, రమేష్ , బల్ రాజు, వెంకటేశం,కిష్టయ్య, కృష్ణ,దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న జి. సంగీతాంజలి..




**హత్నూర, ఆగస్టు 26 ,(సిరి న్యూస్)**

టి పి యూ ఎస్ గురువందనం కార్యక్రమంలో భాగంగా హత్నూర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కె జి బి వి. లో సి ఆర్ టి ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న జి. సంగీతాంజలి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. గత 19 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేష సేవలందిస్తూ, విద్యార్థులకు భౌతిక శాస్త్రాన్ని సులభంగా బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నందుకు ఈ పురస్కారం లభించింది. గురువందనం కార్యక్రమంలో ఆమెకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, సహచరులు అభినందించారు.

# దోమల దండయాత్ర.. ప్రజల అవస్థలు

- **ఫాగింగ్ యంత్రాలు ఉన్నా వినియోగం శూన్యం**
- **దోమల నివారణ చర్యలు కాగితాలకే పరిమితం**

**గుమ్మడిదల, ఆగస్టు 26 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మండలంతో పాటు పురపాలక సంఘం పరిధిలో దోమల బెడద రోజురోజుకు తీవ్రతరం అవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తగిన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ పేరుకు పోతున్న చెత్తాచెదారం, పెరిగిన పచ్చిక గడ్డి, వర్షాల కారణంగా గుంతల్లో నిలిచిపోతున్న నీరు దోమల వృద్ధికి అనుకూలంగా మారుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ప్రతి ఏటా దోమల నివారణ కోసం ఫాగింగ్ మందుల కొనుగోలు, ఫాగింగ్ యంత్రాల నిర్వహణ, డీజిల్ ఖర్చులు తదితర అంశాలపై అధికారులు చర్యలు చేపడుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఫాగింగ్ నిర్వహణ అంతంతమాత్రంగానే ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు గురైనప్పుడు వాటిని సకాలంలో బాగు చేయకపోవడంతో దోమల నివారణ కార్యక్రమం నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంటోందని వాపోతున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో సాయంత్రం సమయం వచ్చిందంటే దోమల తీవ్రత అధికమవుతోందని, ఆరుబయట ఉండటం మాత్రమే కాకుండా ఇళ్లలోనూ ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. చిరుజల్లులు, వర్షాలు కురుస్తున్న సమయంలో దోమల సంఖ్య మరింత పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ అడపాదడపా మాత్రమే వినియోగిస్తుండటంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దోమల నివారణ చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా నిరంతరాయంగా చేపట్టాలని కోరుతున్నారు. గ్రామపంచాయతీలు, పురపాలక అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కనీసం వారానికి ఒకసారి ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ఫాగింగ్ నిర్వహించాలని, దోమల ఉత్పత్తికి కారణమవుతున్న చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, నిల్వ నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాలు, పురపాలక ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించి దోమల బెడదను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటులో జాప్యం

- **నోటిఫికేషన్ జారీ చేసి 20 రోజులు పూర్తయినా కొలిక్కిరాని ప్రక్రియ**

**గుమ్మడిదల, ఆగస్టు 26 (సిరి న్యూస్):**

బొంతపల్లిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ నూతన పాలకమండలి ఏర్పాటు ప్రక్రియలో జాప్యం నెలకొంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన ఆలయానికి పూర్తిస్థాయి పాలకమండలి లేకపోవడంతో ఆలయ అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రభావం పడుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పాలకమండలి ఏర్పాటుకు సంబంధించి దేవాదాయ శాఖ అధికారులు గత జూలై 16న నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 20 రోజులలోగా పాలకమండలి చైర్మన్ పదవితో పాటు ధర్మకర్తలుగా బాధ్యతలు స్వీకరించేందుకు ఆసక్తి ఉన్నవారు తమ దరఖాస్తులను జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. అయితే గడువు పూర్తయి రోజులు గడుస్తున్నా నూతన పాలకమండలి ఏర్పాటుపై ఇప్పటివరకు స్పష్టత రాకపోవడంతో భక్తులు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆలయ పాలకమండలి ఏర్పాటు ద్వారా ఆలయానికి సంబంధించిన అభివృద్ధి పనులు, నిర్వహణ, భక్తుల సమస్యల పరిష్కారంపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. పాలకమండలి లేకపోవడంతో ఆలయంలోని పలు అంశాలపై నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరిగే అవకాశం ఉందని వారు అంటున్నారు. ఇప్పటికే గత బ్రహ్మోత్సవాల సమయంలోనే గత పాలక మండలి పదవీకాలం ముగిసిందని,



ప్రస్తుతం కొనసాగుతున్న శ్రావణమాస ఉత్సవాలను సైతం పూర్తిస్థాయి పాలక మండలి లేకుండానే నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని భక్తులు చెబుతున్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఆలయానికి నూతన పాలకమండలి ఏర్పాటులో జాప్యం ఎందుకు జరుగుతోందనే విషయంపై స్పష్టత లేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాలక మండలి ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయానికి నూతన పాలకమండలిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేడే అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ,వార్డు సభలు

- **ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను సరిచూసుకోవాలి.**
- **జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ఆగష్టు,26(సిరి న్యూస్)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు.ఓటర్లు తమ పేరు,చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు.అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు నమూనా -6, పేరు తొలగింపు లేదా



అభ్యంతరాల కోసం నమూనా–7, వివరాల సవరణ కోసం నమూనా–8ను వినియోగించుకోవాలని సూచించారు. ఆచూకీ లేని,ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన,రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ, వార్డు సభల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.అందులో ఏవైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన ఆధారాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాల తోపాటు అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించనున్నట్లు వెల్లడించారు. అసంగత వివరాలు ఉన్న,గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారి ద్వారా ఓటరుకు లేదా వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేస్తారని పేర్కొన్నారు.నోటీసులో తెలిపిన తేదీ, సమయం,ప్రదేశంలో ఓటరు స్వయంగా విచారణకు హాజరై అవసరమైన అసలు ధ్రువపత్రాలను చూపించాలని సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు సమీప గ్రామ పంచాయతీ భవనం లేదా వార్డు కార్యాలయంలో విచారణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ప్రక్రియపై సందేహాలు లేదా సమస్యలు ఉంటే దూరవాణి సంప్రదింపుల నమోదు సేవ, జాతీయ ఓటరు సేవల ఫిర్యాదుల అంతర్జాల వేదిక ద్వారా లేదా 1950 ఉచిత సహాయ సంఖ్యను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూతకు దరఖాస్తు చేసుకోవాలి

- **చేయూత పెన్షన్లపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వం.**
- **బహుభాషల్లో ఆడియో, వీడియోలు, పాటల రూపంలో ప్రచారం.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ ఆగష్టు,26(సిరి న్యూస్)**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రతా పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చేయూత పెన్షన్



కోసం దరఖాస్తు చేసుకునేలా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపడుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ వెల్లడించారు.

సామాజిక భద్రత,ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్లు అర్హులైన వర్గాలకు ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. అర్హత ఉన్నప్పటికీ సమాచారం లేకపోవడం లేదా దరఖాస్తు చేసుకోకపోవడం వల్ల ఏ ఒక్కరూ ఈ పథకం ప్రయోజనానికి దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించిందని వివరించారు. ఈ ప్రచారంలో భాగంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు " సెర్ప్" ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో చేయూత పెన్షన్లపై అవగాహన కల్పించేలా తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఆడియోలు, వీడియోలు, పాటలను రూపొందించి విడుదల చేసిందన్నారు.. స్థానిక ప్రజల భాష, యాస, జీవన విధానానికి దగ్గరగా ఉండేలా రూపొందించిన ఈ ప్రచార సామగ్రి ద్వారా చేయూత పెన్షన్ల అర్హత, దరఖాస్తు ప్రక్రియ, చివరి తేదీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోందని కలెక్టర్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ అర్హులైన వారందరికీ సమాచారం చేరేలా మీడియా, సామాజిక మాధ్యమాలు,స్థానిక ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సెర్ప్ కోరింది. ప్రజాప్రతినిధులు, అధికారులు,స్వయం సహాయక సంఘాల సభ్యులు,గ్రామీణ స్థాయి సిబ్బంది కూడా ఈ ప్రచారంలో భాగస్వాములై అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించింది. దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనున్నందున అర్హత ఉన్న వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అర్హత ఉన్న ఒక్క వ్యక్తి కూడా దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోకుండా ప్రజలు, మీడియా, సామాజిక మాధ్యమాల సహకారంతో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చిందని చెప్పారు.

# స్మార్ట్ ఫోన్ సైబర్ సెక్యూరిటీపై పరిశోధనకు పీహెచ్.డీ.

**పటాన్ చెరు, ఆగస్టు 26, (సిరి న్యూస్):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి కోక విజయ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'స్మార్ట్ ఫోన్లలో ఇన్ స్టాలేషన్ అనంతర సైబర్ దాడులను గుర్తించి, వాటి ప్రభావాన్ని తగ్గించే అనుకూల వ్యవస్థ'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. కిరీట్ ముప్పవరం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, అప్లికేషన్ ఇన్ స్టాలేషన్ తరువాత తలెత్తే కొత్త ముప్పుల నుంచి ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ భద్రతను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుందని తెలియజేశారు. ఈ పరిశోధన, నకిలీ అప్లికేషన్లు, మ్యాన్-ఇన్-ది-డిస్క్ దాడులు, రీప్యాకేజింగ్, ప్రివిలేజ్ ఎస్కలేషన్, యూఐ స్పూఫింగ్ వంటి ముప్పుల ను నిజ సమయంలో గుర్తించడానికి, ప్రవర్తనా పర్యవేక్షణ, మెషిన్ లెర్నింగ్, రిస్క్-ఆధారిత ప్రతిస్పందన యంత్రాంగాల ను మిళితం చేసే ఒక అనుకూల భద్రతా ఫ్రేమ్ వర్క్ ను అభివృద్ధి చేసిందన్నారు. ప్రతిపాదిత పద్ధతులు నకిలీ-యాప్ గుర్తింపు లో 95.83 శాతం ఖచ్చితత్వాన్ని, MitD దాడి గుర్తింపులో 97.33 శాతం ఖచ్చితత్వాన్ని సాధించగా, డైనమిక్ సెక్యూరిటీ అసెస్ మెంట్ ఫ్రేమ్ వర్క్ 94.7 శాతం గుర్తింపు ఖచ్చితత్వాన్ని నమోదు చేసి, ఇన్ స్టాలేషన్ తరువాత జరిగే విజయవంతమైన దాడులను గణనీయంగా తగ్గించినట్టు వివరించారు. ఈ పరిశోధనను బెంచ్ మార్క్ డేటాసెట్లను ఉపయోగించి ధృవీక రించారని, ఇది కనిష్ట వనరుల వినియోగంతో మెరుగైన దాడి నివారణను ప్రదర్శించి, వనరుల కొరత ఉన్న స్మార్ట్ ఫోన్లలో ఆచరణాత్మక వినియోగానికి దాని సామర్థ్యాన్ని ప్రస్ఫుటీకరిస్తోందన్నారు.

# టేక్మాల్‌లో ఘనంగా ఈద్ మిలాదున్నబీ ర్యాలీ

**టేక్మాల్ ఆగస్టు 26, సిరి న్యూస్;**

టేక్మాల్‌లో మహమ్మద్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా జన్మదినాన్ని పురస్క రించుకొని ఈద్ మిలాదున్నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జామా మసీద్ దగ్గర సామూహిక భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జామా మసీద్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ సమీపంలోని దర్గా హజ్రత్ సయ్యద్ సాహెబ్ హుస్సేనీ రహ్మతుల్లాహి అలైహి వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి, జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యం.ఏ. సలీమ్ మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ఐక్యత, ప్రేమ, సోదరభావం మార్గం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఇతర మతాలను గౌరవిస్తూ, తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అబద్ధాలు చెప్పకుండా ఎల్లప్పుడూ నిజాయితీగా ఉండటం, ప్రతి ఒక్కరినీ ప్రేమతో, గౌరవంతో చూడటం ప్రవక్త చూపించిన మార్గమని తెలిపారు. పేదరికాన్ని అనుభవిస్తున్న వారి పట్ల మమకారంతో ఉండాలని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించి ఆదుకోవాలని మహమ్మద్ ప్రవక్త బోధించారని సలీమ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ మతాన్ని ఆచరిస్తూనే ఇతర మతాలను, వారి విశ్వాసాలను గౌరవించాలని ఆయన సందేశాన్ని అందించారని తెలిపారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన, టేక్మాల్ ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బందికి కి ధన్యవాదములు తెలిపారు. ర్యాలీలో



సోలోజ్‌పల్లి సర్పంచ్ ఇర్షాద్, యం.ఏ. అజీజ్, యం.డి. జమీర్, సయ్యద్ మగ్దూం బాబా టేక్మాల్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు సయ్యద్ షఫీఉద్దీన్, మాజీ వార్డు సభ్యులు సలాఉద్దీన్, వసీమ్, షాకీర్,మతీన్, అతీక్, అసిఫ్,దస్తగీర్, రహమాన్, రహ్మత్, హౌస్, షాహెద్, ఎం.డి. ఇమ్రాన్, సయ్యద్ ఇమ్రాన్, సల్మాన్, యూసుఫ్, ఎస్.డి. వసీమ్, సయ్యద్, ఏజాజ్, సోహెల్, అలీ, సాహెబ్, ఇర్ఫాన్, జహీర్, షఫీ, నదీమ్, ఫెరోజ్ ఖాన్, హషం తదితరులు పాల్గొన్నారు.

# 20 నెలల నిరీక్షణకు తెర.. 307 మందికి డబుల్ ఇళ్లు..





- **లక్కీడ్రాతో 307 ఇళ్ల కేటాయింపు..**
- **470 మందిలో అర్హులకు అవకాశం..**
- **త్వరలో కేటాయింపు పత్రాల పంపిణీ..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 26 (సిరి న్యూస్)**

సొంతింటి కోసం 20 నెలలుగా ఎదురు చూస్తున్న పేదల కల ఎట్టకేలకు నెరవేరింది. మందమర్రిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో రెండో విడతగా 307 ఇళ్లను లక్కీడ్రా ద్వారా అధికారులు అర్హులకు కేటాయించారు. కలెక్టర్ కుమార్ దీపక్ సమక్షంలో మంగళవారం నిర్వహించిన లక్కీడ్రా పారదర్శకంగా సాగింది. మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ప్రాంతంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.20.68 కోట్లతో 21 ఎకరాల్లో 560 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2023 నాటికి 400 ఇళ్లు పూర్తయ్యాయి. తొలి విడతలో 243 మందికి ఇళ్లు కేటాయించగా, రెండో విడతలో 307 ఇళ్ల కోసం 470 మందిని అర్హులుగా గుర్తించారు. సండ్రోనిపల్లిలోని కేఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమానికి డీసీపీ ఎ.భాస్కర్ పర్యవేక్షణ వహించారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్ శర్మ, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, హౌసింగ్ పీడీ బన్సీలాల్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, మందమర్రి సీఐ రమేశ్ పాల్గొన్నారు. పోలీసుల గట్టి బందోబస్తు మధ్య జాబితాలో పేర్లు ఉన్న వారినే వేదిక వద్దకు అనుమతించారు. లక్కీడ్రా అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ త్వరలో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇళ్లు దక్కిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ఆదేశాలు, కృషితోనే ఇళ్ల కేటాయింపు పూర్తయిందని పేర్కొన్నారు.

# వీరశైవ లింగాయత్ మహాపాదయాత్ర

- **కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు ఆహ్వానం**
- **పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు 19వ మహాపాదయాత్ర..**
- **18 ఏళ్లుగా కొనసాగుతున్న మహాపాదయాత్రకు ఈసారి భారీ ఏర్పాట్లు**

**రామచంద్రపురం, ఆగస్టు 26 (సిరి న్యూస్):**



సమాజ సంక్షేమం, సర్వజన శ్రేయస్సు లక్ష్యంగా నిర్వహించనున్న 19వ వీరశైవ లింగాయత్ మహాపాదయాత్రకు హాజరుకావాలని వీరశైవ లింగాయత్ సేవా సమితి, మహాపాదయాత్ర కమిటీ ప్రతినిధులు కర్ణాటక మంత్రి, అఖిల భారత వీరశైవ మహాసభ నూతన జాతీయ అధ్యక్షుడు ఈశ్వర్ భీమన్న ఖండ్రేను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహాపాదయాత్ర బ్రోచర్‌ను ఆయనకు అందజేసి యాత్ర వివరాలను తెలిపారు. పటాన్‌చెరు నుంచి బొంతపల్లిలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయం వరకు మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణ, సామాజిక సామరస్యం, ఆధ్యాత్మిక చైతన్యం, నైతిక, సాంస్కృతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరశైవ లింగాయత్ సమాజం చేపడుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను ఈశ్వర్ ఖండ్రే అభినందించారు. ఇలాంటి మహాపాదయాత్రలు సమాజంలో సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు సమాజ ఐక్యతకు, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. 19వ మహాపాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. గత 18 ఏళ్లుగా మహాపాదయాత్రను నిరంతరంగా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వీరశైవ లింగాయత్ ప్రముఖులు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువరాజ్ నివర్తి రాజ్ మోరే, చంద్రశేఖర్ (రాజు), జగప్ప, అభినయ్ కుమార్, మఠం ప్రశాంత్ కుమార్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు వి. చంద్రారెడ్డి



**జిన్నారం ఆగస్టు 26 సిరి న్యూస్**

బొల్లారం డివిజన్ పరిధిలో మీలాదు ఉన్ నబి వేడుకలను ముస్లిం సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు సోదరులు కుల మతాలకు అతీతంగా నిర్వహించిన భారీ శాంతి ర్యాలీలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వ మానవాళి శ్రేయస్సు కోసం కృషి చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని కొనియాడారు. ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్నబి శుభాకాంక్షలు తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులను ముస్లిం సోదరులు మత పెద్దలు ఘనంగా సన్మానించారు. పట్టణంలో ర్యాలీ ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖలీమ్, మునీర్, తాహీర్, యువజన నాయకులు అబ్దుల్ బషీర్, రియాజ్, అజామ్, ఖాసీమ్, ముక్తర్, ఇంతియాజ్, అపు, ముస్లిం సోదరులు, మత పెద్దలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## విదేశీ పర్యటనకు పెద్ద శంకరం పేట టీచర్

**పెద్ద శంకరం పేట, ఆగస్టు 26, (సిరి న్యూస్)**



తెలంగాణ విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ విద్యా పరిశోధన పర్యటనకు మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటకు చెందిన ప్రభుత్వ సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్ జి టీ ) బ్యాంగి ప్రసన్న కుమార్ ఎంపికయ్యారు. ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు, నూతన బోధనా పద్ధతులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను విద్యాశాఖ ఈ ప్రత్యేక కార్యక్రమం కింద ఎంపిక చేసింది. వచ్చే నెలలో వీరి పర్యటన ఉంటుంది.

## పిల్లల సౌకర్యాల కల్పన అభినందనీయం: సింధు ఆదర్శ్ రెడ్డి..

### అభిలాష వొకేషనల్ సెంటర్ లో నూతన డైనింగ్ ఏరియా షెడ్ ప్రారంభం



**రామచంద్రాపురం, ఆగస్టు 26 (సిరి న్యూస్) :**

బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని అభిలాష వొకేషనల్ సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన డైనింగ్ ఏరియా షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు డైనింగ్ ఏరియా షెడ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పిల్లల సంక్షేమం కోసం అభిలాష వొకేషనల్ సెంటర్, లేడీస్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీహెచ్ఈఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై. శ్రీనివాస రావు, లేడీస్ వెల్ఫేర్ సెంటర్ అధ్యక్షురాలు వై. శ్రీదేవి, అభిలాష వొకేషనల్ సెంటర్ సిబ్బంది, లేడీస్ వెల్ఫేర్ సెంటర్ సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్




**రామచంద్రాపురం, ఆగస్టు 26 (సిరి న్యూస్):**

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్‌లోని ఓల్డ్ రామచంద్రాపురం మీట్ మార్కెట్ వద్ద నిర్వహించిన వేడుకల్లో రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఆయన మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని హాజరైన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నిర్వాహకులు, స్థానిక నాయకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకలు

పోలీసుల పటిష్ట బందోబస్తు.. ప్రశాంతంగా ముగిసిన వేడుకలు.







**మెదక్ ఆగష్టు,26(సిరి న్యూస్)**

మెదక్ జిల్లా వ్యాప్తంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. మెదక్ టౌన్,చేగుంట, శంకరంపేట–ఏ, టేక్మాల్, నార్సింగి, నర్సాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, సున్నితమైన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించారు. ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు.మత సామరస్యం,పరస్పర గౌరవం,శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు జిల్లా పోలీసు శాఖ కృతజ్ఞతలు తెలిపింది. పోలీసులకు సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులను అధికారులు అభినందించారు.జిల్లాలో అన్ని పండుగలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహిస్తూ మెదక్ జిల్లా ప్రశాంతతకు ప్రజలు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

## పశుపోషణపై రైతులకు అలర్ట్!..

- సరైన మేత..ఆరోగ్యకర పశువులు..
- వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..
- రైతులకు మందుల పంపిణీ..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 26 (సిరి న్యూస్)**

పశువులు, మేకలు, గొర్రెల పెంపకంలో సరైన పోషకాహారం, వ్యాధుల నివారణ, సకాలంలో వైద్యం ఎంతో కీలకమని పశువైద్య నిపుణులు సూచించారు. బుచ్చయ్యపల్లి గ్రామపంచాయతీలో బుధవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు పశుపోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు ఉదయం, సాయంత్రం తగిన సమయంలో సరైన మోతాదులో ఎండు గడ్డి, పచ్చి గడ్డి, అవసరమైన పోషకాహారం అందించాలని సూచించారు. పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాధులు సోకినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే పశువైద్యుల సూచనల మేరకు చికిత్స అందించాలని తెలిపారు. పశువుల ఆరోగ్యంపై రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపల్లి సర్పంచ్, మండల ఫోరం అధ్యక్షుడు జాడి మహేశ్వర్, పశువైద్యాధికారి పావని, పశుసంవర్ధక సహాయకురాలు రూప, రమణ, ప్రశాంత్తో పాటు పశువులు, మేకలు, గొర్రెలు పెంచుతున్న రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

# 22ఏపై రాజకీయ రణరంగం!..





- 22ఏ భూములపై భగ్గుమన్న పోరు!..
- ప్రజల ఆస్తులపై పగలబూట్టు దాడి అని నేతల ఆగ్రహం
- ఆమరణ దీక్షకు బిఆర్ఎస్ నేతలు సిద్ధం!..
- ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటమే!..

**మేడ్చల్ ప్రతినిధి, ఆగస్టు 26 (సిరి న్యూస్):**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 22ఏ భూముల సమస్య పెను సంచలనంగా మారింది. వేల మంది ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న ఈ అంశంపై అధికార, ప్రతిపక్ష నేతలు ఏకమై ప్రభుత్వంపై నేరుగా యుద్ధమే ప్రకటించారు. కేపీహెచ్‌బీ డివిజన్ ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశం రాజకీయ వేడిని రాజేసింది.. పట్టా భూములను 22ఏ జాబితాలో బలవంతంగా చేర్చడంపై నేతలు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ్ పాల్గొని ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ ప్రజా ప్రయోజనాలను గాలికొదిలేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పట్టా భూముల్లో నివసిస్తున్న అమాయక ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే 22ఏ జాబితాలో ఎలా చేరుస్తారని నిలదీశారు..

**పట్టా భూములను రాత్రికి రాత్రే 22ఏ జాబితాలో చేర్చడం ఏమిటి?..**

భూ సమస్యపై ప్రజల తరఫున ఉధృత పోరాటం చేపడతామని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత భగ్గుమనేలా తీవ్రతరం చేస్తామని నేతలు హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగంగానే భూదందాకు పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించిన నేతలు, ప్రజల భూముల విషయంలో ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గకపోతే ఉద్యమాన్ని మరింత భారీ స్థాయిలో తీసుకెళ్తామని హెచ్చరించారు..

**రేవంత్‌రెడ్డి భూదందాకు పాల్పడుతున్నారు..**

ప్రజలకు న్యాయం జరిగే వరకు తాను వెనుకడుగు వేయనని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంచలన ప్రకటన చేశారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని గర్జించారు. ఈ ప్రకటనతో స్థానికంగా రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది..

**అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు తాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు, ఉద్యానవనాలు, రహదారులు, ప్రజా రవాణా వంటి ఎన్నో సదుపాయాలు కల్పించామని నేతలు గుర్తుచేశారు. కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను సైతం అమలు చేశామని చెప్పారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ప్రజాహిత అభివృద్ధి పనులను గాలికొదిలేసి, ఉన్న భూములపైనే కన్నేసి కూర్చుందని తీవ్రంగా విరుచుకుపడ్డారు. 22ఏ భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే రానున్న రోజుల్లో పోరాటం మరింత భగ్గుమంటుందని నేతలు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే 22ఏ నిర్ణయాన్ని పునఃపరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అంటే ప్రజలకు అండగా ఉండాలి తప్ప గుది బండగా మారకూడదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అన్ని ఆధారాలతో చట్టబద్ధంగా ఉన్న ఈ భూములను ఏకపక్షంగా 22ఏలో ఎలా చేరుస్తారని ప్రశ్నించిన ఆయన, ఇది ప్రజలను నిలువునాముంచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు..

**ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటమే..**

ఇదంతా జరుగుతున్నా అధికారులు కళ్లు మూసుకుని కూర్చోవడం దారుణమని, ప్రభుత్వం నిర్ణయం మార్చుకునే వరకు ప్రజల పక్షాన కడదాకా పోరాడతామని జయప్రకాశ్ నారాయణ్ సవాలు విసిరారు. ఈ వ్యాఖ్యలతో సమావేశం మరింత హాట్‌గా మారింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ్‌తో పాటు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబేహా గౌసుద్దీన్, పగడాల శిరీషా బాబు రావు, ముద్దం నరసింహా యాదవ్, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగా రావుతో పాటు శేర్లింగంపల్లి నేతలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# బోయిన్‌పల్లి..హస్మత్‌పేట్‌లో మిలాద్ ఉన్ నబీ వైభవం..





- అంగరంగ వైభవంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు..
- ప్రార్థనలు, నాతులతో మార్మోగిన మసీదులు..
- ఊరేగింపులతో సందడిగా ఓల్డ్ బోయిన్ పల్లి..హస్మత్ పేట్..
- అన్నదానం, సేవలతో చాటిన మానవత్వం..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 26 ( సిరి న్యూస్ ):**

మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా జరిగే పవిత్ర మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఈరోజు నగర శివార్లలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా, అపూర్వ భక్తి పారవశ్యంతో జరిగాయి. వేకువజాము నుంచే ఆ ప్రాంతాల్లో పండుగ సందడి మొదలైంది. మసీదులు, వీధులు, ప్రధాన కూడళ్లు రంగురంగుల విద్యుత్ దీపాలు, తోరణాలు, పూలదండలతో సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం మొత్తం వెలుగుల హరివిల్లులా మారి చూపరులను ఇట్టే ఆకట్టుకుంది..

**వీధుల్లో ఊరేగింపులు..యువత, చిన్నారుల ఉత్సాహం..**

వేడుకల్లో భాగంగా పలుచోట్ల చిన్నపాటి ఊరేగింపులు కూడా నిర్వహించారు. పచ్చని జెండాలు, ప్రత్యేక అలంకరణలతో సాగిన ఈ ఊరేగింపుల్లో యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నినాదాలు చేశారు. చిన్నారులు, వృద్ధులు సైతం వేడుకల్లో భాగస్వాములై పండుగ శోభను ఇనుమడింపజేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం అంతటా పండుగ వాతావరణం నెలకొంది..

**తెల్లవారుజామునే మొదలైన ప్రార్థనలు..**

ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో మసీదుల వద్ద, వీధుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్ద గుమిగూడి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు తమ ప్రసంగాల ద్వారా మహ్మద్ ప్రవక్త జీవితం, ఆయన బోధించిన ప్రేమ, శాంతి, దయ, సోదరభావం, మానవత్వం వంటి సందేశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన దువాలు, నాతులు వాతావరణాన్ని పూర్తిగా ఆధ్యాత్మికంగా మార్చేశాయి. పలుచోట్ల మైకుల్లో మార్మోగిన మతపరమైన గీతాలు, భక్తిగీతాలు వేడుకలకు మరింత శోభను తెచ్చాయి..

**సేవా కార్యక్రమాలతో నిండిన మానవత్వ పరిమళం..**

మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో అసలైన ప్రత్యేకత సేవా కార్యక్రమాలే సంతరించుకున్నాయి. పలుచోట్ల భారీ ఎత్తున అన్నదానం నిర్వహించి పేదలు, నిరుపేదలకు కడుపు నిండా భోజనం అందించారు. మిఠాయిలు, ఇతర తినుబండారాలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే అవసరమైన పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఈ సేవా కార్యక్రమాల్లో స్థానిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు చురుగ్గా పాల్గొన్నాయి..

**సర్వమత సామరస్యానికి సజీవ నిదర్శనం..**

విశేషమేమిటంటే..ఈ వేడుకల్లో వివిధ మతాలకు చెందిన ప్రజలు కూడా భాగస్వాములై సర్వమత సామరస్యానికి చిహ్నంగా నిలిచారు. మతసామరస్యం, సోదరభావం, మానవత్వం అనే గొప్ప సందేశంతో సాగిన ఈ మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఓల్డ్ బోయిన్‌పల్లి–హస్మత్‌పేట్ ప్రాంతంలో ఐక్యతకు, సామరస్యానికి నిదర్శనంగా నిలిచాయి. నగర వ్యాప్తంగా జరిగిన ఇలాంటి వేడుకల్లో ఇది ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, స్థానికుల మనసులను గెలుచుకుంది. రాత్రి వరకూ కొనసాగిన ఈ కార్యక్రమాలు అంతిమంగా శాంతి, సోదరభావ సందేశంతో ముగిశాయి..

# నూతన వ్యాపారాలకు ప్రోత్సాహం ఇవ్వాలి..

**హనుమకొండ, ఆగస్టు 26 :** బాల సముద్రంలోని ABC ఫ్యామిలీ సెలూన్ నూతన బ్రాంచ్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెలూన్‌ను సందర్శించిన ఎంపీ.. నిర్వాహకులు ప్రవీణ్, ప్రశాంత్‌లను అభినందించారు. అనంతరం మీడియాతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన ABC ఫ్యామిలీ సెలూన్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన

ఈ నూతన బ్రాంచ్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. స్థానికంగా నూతన వ్యాపారాలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కడియం కావ్య పేర్కొన్నారు. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తూ మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ABC ఫ్యామిలీ సెలూన్ నిర్వాహకులు ప్రవీణ్, ప్రశాంత్‌లు వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఎంపీ కడియం కావ్య అభిలషించారు. కార్యక్రమంలో సెలూన్ సిబ్బంది, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.నూతన వ్యాపారాలకు ప్రోత్సాహం ఇవ్వాలి..


**ABC ఫ్యామిలీ సెలూన్ ప్రారంభోత్సవంలో ఎంపీ కడియం కావ్య**

**హనుమకొండ, ఆగస్టు 26** బాలసముద్రంలోని ABC ఫ్యామిలీ సెలూన్ నూతన బ్రాంచ్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం ప్రారంభించారు.

డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరు కూడా ఆన్‌లైన్‌కే అలవాటు పడుతున్నారు. అందరూ ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడం అనేది సాధారణంగా మారిపోయింది. అయితే ఆన్‌లైన్‌లో షాపింగ్‌లు చేస్తే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఇబ్బందులు తలెత్త అవకాశం ఉందని టెక్ నిపుణులు సూచిస్తున్నారు. ఇక ప్రముఖ ఆన్‌లైన్ దిగ్గజాలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి కంపెనీలు వినియోగదారుల కోసం కొత్త కొత్త ఆఫర్లను ప్రకటిస్తుంటాయి. ఆన్‌లైన్‌లో ఏదైనా వస్తువు కొనాలనుకుంటే కొన్ని టిప్స్ పాటిస్తే ఎంతో మంచిది. మీరు ఏవైనా వస్తువులు కొనాలనుకుంటే సేల్ కన్నా ముందే వాటిని సెలెక్ట్ చేసి పెట్టుకోవాలి. సేల్ కన్నా ముందు వాటి ధరలు ఎంత ఉన్నాయో, సేల్ సమయంలో ఎంత ఉన్నాయో ట్రాక్ చేయడం మర్చిపోవద్దు. కొన్ని వస్తువుల ధరలు సేల్ సమయంలో కూడా తగ్గవు. అలాంటప్పుడు మీరు సేల్ వరకు ఎదురు చూడటం వృథా అనే చెప్పాలి.

# ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారా.. అయితే ఇవి గుర్తుంచుకోండి

**డిస్కౌంట్ యాడ్స్‌ను చూసి నమ్మొద్దు :**
మీరు నేరుగా సేల్ సమయంలోనే మీకు కావాల్సిన ప్రొడక్ట్ సెర్చ్ చేస్తే అప్పుడు ధర తగ్గిందా లేదా అన్న విషయం తెలియదు. అందుకే ముందు నుంచే ట్రాక్ చేయడం బెటర్. ఇకామర్స్ సైట్‌లో కనిపించే డిస్కౌంట్లను పూర్తిగా నమ్మకూడదు. 50 శాతం, 60 శాతం, ఒక్కోసారి 90 శాతం డిస్కౌంట్ అని యాడ్స్ కనిపిస్తాయి. స్క్రీన్‌లపై కనిపిస్తున్న డిస్కౌంట్స్ చూసి మోసపోకూడదు. మీరు కొనాలనుకునే వస్తువు ధర ఎంత ఉంటుందో మీకు ఓ ఐడియా ఉండాలి. అంతకన్నా తక్కువకే ఆ వస్తువు లభిస్తే కొనాలి. అంతే తప్ప డిస్కౌంట్స్ చూడకూడదు. మీరు ధరలను చాలాకాలంగా ట్రాక్ చేస్తూ ఉంటే సేల్ సమయంలో ఆ వస్తువు ధర తక్కువ ఉందో ఎక్కువ ఉందో తెలుస్తుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో వస్తువుల ధరలను ట్రాక్ చేసేందుకు వెబ్‌సైట్స్, యాప్స్ ఉంటాయి. వాటిని ఉపయోగించుకోవచ్చు. మీరు కొనాలనుకునే వస్తువులను విష్ లిస్ట్‌లో పెట్టుకోవాలి. ఆ ప్రొడక్ట్‌స్‌కి సంబంధించి ఆఫర్స్ ఉంటే మీకు నోటిఫికేషన్స్ వస్తాయి. మీరు కొనే వస్తువులకు బ్యాంక్ ఆఫర్స్ ఉన్నాయో లేదో చెక్ చేయాలి.
కొన్ని ప్రొడక్ట్స్ ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే లభిస్తాయి. మరికొన్ని ప్రొడక్ట్స్ అమెజాన్‌లో లభిస్తాయి. కానీ చాలావరకు ప్రొడక్ట్స్ రెండు వెబ్‌సైట్లలో లభిస్తాయి. ధర ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ కొనాలి. ఉదాహరణకు .. మీరు వాషింగ్ మెషీన్ కొనాలనుకుంటే పెద్దపెద్ద బ్రాండ్స్ ఆన్‌లైన్‌లో అమ్ముతుంటాయి. బ్రాండ్స్ వేర్వేరు అయినా ఫీచర్స్ ఒకేలా ఉంటాయి. ఆన్‌లైన్ షాపింగ్ ఓ వ్యసనం లాంటిదన్న విషయం గుర్తుంచుకోవాలి. ఈ వ్యసనంలో పడి అవసరం లేని వస్తువులు కూడా కొనుగోలు చేయకూడదు. అవసరం లేని వస్తువులు కొంటూ పోతే జీవితంలో ఏదో ఓ దశలో అవసరం ఉన్న వస్తువుల్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందన్న విషయం గుర్తించుకోవాలి.




**నకిలీ వెబ్‌సైట్లపై నిఘా పెట్టండి :**
ఈ మధ్య కాలంలో నకిలీ వెబ్‌సైట్లు చాలా పుట్టుకొస్తున్నాయి. నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి వివిధ ఆఫర్ల అంటూ కస్టమర్లను నమ్మించి మోసం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఒక ప్రొడక్ట్‌స్‌ను చూపించి డెలివరి చేసే సమయంలో నాణ్యత లేకుండా నకిలీ వస్తువులను డెలివరి చేసిన సందర్భాలు కూడా ఉంటున్నాయి. అందుకే ఏదైనా వస్తువులను ఆర్డర్ చేస్తే ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తదితర మంచి పేరున్న సైట్ల నుంచి ఆర్డర్ చేస్తే మంచిది. అలాంటి వారు వస్తువుల్లో ఏదైనా పొరపాటు జరిగితే రిటన్ తీసుకుని క్యాష్‌బ్యాక్‌ను అందిస్తారు. లేదా నాణ్యతమైన వస్తువులను అందిస్తారు.

**వెబ్‌సైట్ కంపెనీ :**
ఆకర్షణీయమైన బట్టలు లేదా ఇతర ప్రొడక్ట్స్ ఫోటోలు చూపిస్తూ సోషల్ మీడియాలో అనేక ప్రకటనలు కనిపిస్తూ ఉంటాయి. అయితే అలాంటి వెబ్‌సైట్ యొక్క రిజిస్టర్ కార్యాలయం చిరునామా, ల్యాండ్‌లైన్ నెంబర్, ఇతర సమాచారారాన్ని తనిఖీ చేయడం ముఖ్యం. ఏ కంపెనీ వెబ్ సైట్‌లోనైనా వారి పూర్తి సమాచారం కనిపించకపోతే అలాంటి సైట్ నుంచి షాపింగ్ చేయవద్దు.

**వస్తువుల్లో నాణ్యత - వారంటీ :**
డిస్కౌంట్లను చూసి అనేక మంది నాణ్యత లేని వస్తువులను కొనుగోలు చేసి మోసపోతుంటారు. దీంతో ఏదైనా వస్తువులను కొనే ముందు దాని రివ్యూలు, రేటింగ్‌లు చూడటం, దాని గురించి ఆన్‌లైన్‌లో వెతకడం మంచిది. తక్కువ ధర ఉంది కదా అని కొనుగోలు చేస్తే నాణ్యత లేకుండా ఉంటాయి. అలాగే ఆన్‌లైన్ షాపింగ్ చేసే సమయంలో ఏసీ, టీవీ, ఫ్రిజ్, మైక్రోవేవ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు తప్పనిసరిగా వారంటీని చూడాలి. మంచి నాణ్యతతో ఎక్కువ కాలం వారంటీ అందించే వస్తువులనే కొనుగోలు చేయడం ఉత్తమం

**క్యాష్ అన్ డెలివరీ :**
ఇటీవల అనేక కొత్త కొత్త కంపెనీలు వివిధ పేర్లతో ఆన్‌లైన్ షాపింగ్‌లోకి దిగుతున్నాయి. ఇంటర్‌నెట్ ఆకర్షనీయమైన ఆపర్లతో ప్రకటనలు గుప్పిస్తున్నాయి. అయితే అలాంటి వాటిని నమ్మడం అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాక.. ఆయా కంపెనీలు డెలివరీ చేయకుండా మోసం చేసే ప్రమాదం కూడా ఉంది. అందుకే కొత్త సైట్‌ల నుంచి ఏదైనా ఆర్డర్ చేస్తే క్యాష్ అండ్ డెలివరి ఆప్షన్ ఎంచుకుంటే మంచిది. ఒక వేళ వారు ఈ ఆప్షన్ ఇవ్వకపోతే అలాంటి సైట్ల జోకికి వెళ్లకపోవడం మంచిది.



# ఐడియా అదుర్స్ కదూ

మీరు చేస్తోన్న ఉద్యోగంతో విసిగిపోయారా.? చాలీచాలనంత జీతం మీ నిత్యావసరాలకు ఏమాత్రం సరిపోవట్లేదా.? ఏదైనా వ్యాపారం చేసే ఆలోచన ఉందా.? సాధారణంగా ఏ వ్యాపారమైన మొదలుపెట్టే ముందు.. అందులో రిస్క్ ఎంత ఉంటుంది.? పెట్టుబడి పెడితే.. వచ్చే లాభం ఎంత.? ఇలా ప్రశ్నలు ఎన్నో ఉంటాయి. అలాంటి వారి కోసం అదిరిపోయే బిజినెస్ ఐడియాలు ఇవి. పెద్ద రిస్క్ లేకుండా.. కేవలం రూ. 50 వేల పెట్టుబడితో ఈ వ్యాపారాలు మొదలుపెట్టొచ్చు. దీంతో నెలనెలా రూ. లక్షల్లో ఆదాయం మీ సొంతమవుతుంది.

**వస్త్రాల వ్యాపారం:**
పెళ్లిళ్లు, పండుగలు, పుట్టినరోజు.. ఇలా ఒకటేమిటి మనకు స్పెషల్ డే ఏదైనా కూడా కొత్త బట్టలు వేసుకోకుండా ఆ రోజు గడవదు. దేశంలో ఏ ప్రాంతమైనా.. బట్టలకు డిమాండ్ విపరీతంగానే ఉంటుంది. కాబట్టి మీరు కూడా ఈ వ్యాపారాన్ని కేవలం రూ. 50 వేల పెట్టుబడితో ప్రారంభించి.. మాంచి లాభాలు ఆర్జించవచ్చు.

**స్ట్రీట్ ఫుడ్ స్టాల్ లేదా ఫుడ్ ట్రక్ :**
ఫుడ్ బిజినెస్.. దేశంలో ఎలాంటి రిస్క్ లేకుండా బెస్ట్ బిజినెస్ ఆప్షన్ ఇది అని చెప్పొచ్చు. మీరు కూడా రూ. 50 వేల పెట్టుబడితో ఏదైనా వ్యాపారాన్ని మొదలు పెడితే.. వెంటనే ఫుడ్ స్టాల్ లేదా ఫుడ్ ట్రక్‌ని ప్రారంభించండి. దీనికి ముడిసరుకుతోనే పని ఉంటుంది. కాబట్టి వాటికీ అయ్యేది తక్కువ ఖర్చే. ఇక క్వాలిటీ, క్వాంటిటీ మాంచిగా ఉంటే.. మీ ఫుడ్ బిజినెస్ అద్భుతమే. నూడుల్స్, మోమోస్, చాట్‌పకోడీ లేదా ఇతర స్ట్రీట్ ఫుడ్ వంటి వాటిని మీరు అమ్మవచ్చు. ఫుడ్ ట్రక్కులలో కూడా మీరు స్ట్రీట్ ఫుడ్స్, టిఫిన్స్ లాంటివి ఉదయం, సాయంత్రం సమయాల్లో అమ్మకం పెట్టుకోవచ్చు.

**ట్యూషన్ లేదా ఆన్‌లైన్ క్లాసులు :**
మీరు చదివిన, అలాగే మీ జ్ఞానాన్ని మరికొంతమందికి పంచితే.. తప్పేమి కాదు. ఇప్పుడు టీచర్స్‌గా చేస్తున్న ప్రతీ ఒక్కరు.. సాయత్రంం వేళల్లో పిల్లలకు ట్యూషన్లు చెబుతున్నారు. మరి మీరు కూడా ఏ సబ్జెక్ట్‌లో పరిజ్ఞానాన్ని కలిగి ఉంటే.. మీ ఇంటి దగ్గరే స్థానికంగా టెన్త్ అంతకన్నా తక్కువ తరగతులు చదువుతున్న పిల్లలకు.. అలాగే ఇంటర్ చదివేవాళ్లకు ట్యూషన్ చెప్పొచ్చు. లేదా యూట్యూబ్ ద్వారా సొంతంగా చానెల్ ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్ క్లాసులు కూడా బోధించవచ్చు.

**వెడ్డింగ్ ప్లానర్ :**
అతి తక్కువ పెట్టుబడితో ఇదొక విజయవంతమైన వ్యాపారం. మీరు మీ కస్టమర్ అవసరాలకు అనుగుణంగా అత్యంత సృజనాత్మకంగా వివాహాలు, ఈవెంట్‌లను నిర్వహిస్తే.. ఈ వ్యాపారంలో మాంచి లాభాలు ఆర్జించినట్టే. దీన్ని ప్రారంభించడానికి కొంత డబ్బు అవసరం పడుతుంది. కానీ ఆ తర్వాత వ్యాపారం లాభాల బాట పడితే.. రాబడి చాలా బాగుంటుంది. వెడ్డింగ్ ప్లానింగ్ లేదా ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో అనేక డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఉదాహరణకు క్యాటరింగ్, ఫోటోగ్రఫీ, డెకరేషన్ ఇలా ఏదొక దానిపై మీరు డబ్బు సంపాదించవచ్చు.

**ఊరగాయ వ్యాపారం :**
తక్కువ పెట్టుబడితో మరో మంచి వ్యాపార ఆలోచన ఊరగాయ వ్యాపారం. భోజనం సమయంలో ఊరగాయ లేకుండా చాలామందికి ముద్దదిగదు. దాదాపు ప్రతి ఇంట్లో కనీసం ఒక రకమైన ఊరగాయ ఉంటుంది. అందువల్ల, మీరు చిన్న వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంటే, ఊరగాయ వ్యాపారం రిస్క్ లేని బిజినెస్. భారతీయ మార్కెట్లలో ఏడాది పొడవునా పచ్చళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎవరైనా చాలా సులభంగా ఈ వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు.



# కొబ్బరిచిప్పలో చాయ్.. ఓసారి ట్రై చెయ్

భోజనంను ప్లేట్లలో కాకుండా అరటి ఆకుల్లో, ఇస్తారి ఆకులో తినడం వల్ల ఆరోగ్యకరం అని మనందరికీ తెలుసు. సాధారణ లోహ పాత్రల్లో వండిన భోజనం కంటే మట్టికుండలో వండిన భోజనం రుచిగా ఉంటుందని చెప్తారు. అలాగే బొంగులో చికెన్, దొన్నెలో బిర్యానీ, మురికి అన్నం, జంబలకిడి జారు మిఠాయి వంటివి కొన్ని రోజుల పాటు ఇంటర్నెట్లో ట్రెండ్ అయ్యాయి, ఇందులో కొన్ని ఇప్పటికీ ప్రజాదరణ కలిగి ఉన్నాయి. ఇప్పడు కొబ్బరిచిప్పలో చాయ్ అనేది నెట్టింట్లో ఉడుకుతోంది.
మీరు కొబ్బరిచిప్పలో కొబ్బరి తినేసి చిప్పను పాడేస్తున్నట్లయితే ఇక నుంచి అలా చేయకండి, వాటిని భద్రంగా దాచుకోండి. ఎందుకంటే అందులోనే టీ కాచుకోవచ్చు. కొబ్బరిచిప్పల్లో వండిన అన్నం, కూరలు, పాయసం ఇలా ఏది వండినా కూడా రుచికరంగా ఉంటుందట. కొబ్బరిచిప్పలో పీచుపదార్థంతో పాటుగా విటమిన్లు ఏ, బీ, ఈ, కే లు ఉంటాయి. ఇందులో ఆహారపానీయాలను ఉడికించుకొని తింటే అదనంగా ఈ పోషకాలు కూడా శరీరానికి అందుతాయి, ఇవి మీ ప్రేగు కదలికలను మెరుగుపరుస్తాయి, జీర్ణవ్యవస్థకు మంచిది. అంతేకాకుండా ఇవి పర్యావరణ హితమైనవి అని అంటున్నారు. ఇప్పడు కొబ్బరిచిప్పలో టీ చేసుకొనే ట్రెండ్ మళ్లీ మొదలైంది.



**ఎలా చేసుకోవాలంటే..?**
1 కొబ్బరి చిప్ప
1/4 టీస్పూన్ టీ పొడర్
1/2 టీస్పూన్ చక్కెర
1-2 ఏలకులు
1/2 కప్పు పాలు, అవసరమైనన్ని నీళ్లు
కొబ్బరిచిప్పలో టీ తయారుచేసే విధానం...
ముందుగా రంధ్రాలు లేని ఒక కొబ్బరి చిప్పను తీసుకోండి. దానిని శుభ్రంగా కడగండి.
ఈ చిప్పలో పాలు, నీళ్లు పోసి తక్కువ మంట మీద వేడిచేయండి.
పాలు ఉడకటం ప్రారంభమయ్యాక టీ ఆకులు, చక్కెర, యాలకులు వేసి మరిగించండి.
పొంగకుండా కలుపుతూ ఉండండి, చాయ్ సిద్ధం అవుతుంది.
అంతే, ఇద్ది కొబ్బరిచిప్పలో టీ.. మీరు చేసుకొని తాగి చూడండి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.